ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గుంటూరు జిల్లా వార్తలు

5

శనివారం 25 అక్టోబరు 2025



జాతీయ రహదారి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

డిసెంబరుకి వెస్టు బైపాసు సిద్ధం

జాతీయ రహదారుల పనులు పరిశీలించిన అన్సారియా

మంగళగిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వెస్ట్ బైపాస్ పనులు తుది దశకు చేరుకున్నాయని, కాజా టోల్ ప్లాజా వద్ద అప్రోచ్ పనులు, కొన్ని బ్రిడ్జిల పనులు పూర్తి చేసి డిసెంబరుకి ప్రారంభించేందుకు సిద్ధం చేస్తున్నట్లు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు నివేదించారు. శుక్రవారం కలెక్టర్ జాతీయ రహదారి పనులను తనిఖీ చేశారు. జాతీయ రహదారి అభివృద్ధి, విస్తరణ పనులు, డ్రెయిన్ల నిర్మాణానికి ప్రతిపాదించిన ప్రాంతాలను పరిశీలించారు. టోల్‌ప్లాజా వద్ద బ్రెస్ట్ ఫీడింగ్ సెంటర్, మరుగుదొడ్లను పరిశీలించారు. కాకాని వద్ద గుంటూరు నుంచి వెళ్లే వాహనాలు జాతీయ రహదారికి అప్రోచ్ రోడ్డు ఏర్పాటుకు పెండింగ్‌లో ఉన్న భూసేకరణపై కలెక్టర్ రెవెన్యూ అధికారులతో చర్చించి సూచనలు అందించారు. తాడేపల్లి మండలం కొలనుకొండ, గుంటూరు తూర్పు మండల పరిధిలోని బుడంపాడు వద్ద జాతీయ రహదారి ఆరు లైన్ల విస్తరణ కోసం నూతనంగా నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల పురోగతిని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను అడిగి తెలుసుకున్నారు. టోల్ ప్లాజా వద్ద బైపాస్ అప్రోచ్, వెంకటపాలెం సమీపంలో కొండవీటి వాగుపై బైపాస్ వంతెన పనుల పురోగతిని జాతీయ రహదారుల అధికారులు కలెక్టర్‌కు వివరించారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ అధికారులను సమన్వయం చేసుకుంటూ జాతీయ రహదారుల అధికారులు డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వెస్ట్ బైపాస్‌లో వర్షం నీరు నిల్వ ఉండకుండా అవసరమైన ప్రాంతాల్లో డ్రెయిన్లు నిర్మించాలని తెలిపారు. తాడేపల్లి సర్వీస్ రోడ్లపై, కుంచనపల్లి సెంటర్, కాజా టోల్ ప్లాజా వద్ద వర్షం నీరు నిల్వ ఉండకుండా నిర్మించాల్సిన డ్రెయిన్ల ప్రతిపాదనలను అధికారులు కలెక్టర్‌కు మ్యాపుల ద్వారా వివరించారు. తాడేపల్లి, కాజా వద్ద జాతీయ రహదారి పక్కన నిర్మాణాలు పెరిగిపోవడంతో వర్షం నీరు రహదారిపై నిలిచిపోతుందన్నారు. సర్వీస్ రోడ్డుకు ఇరువైపుల కాలువలు నిర్మించి ప్రత్యేక డ్రెయిన్లు ద్వారా నీటిని సమీపంలోని వాగుల్లోకి మళ్లించాలని తెలిపారు. విజయవాడ గొల్లపూడి నుంచి వెంకటపాలెం వరకు వాహనాలు వెస్ట్ బైపాస్‌పై ప్రయాణిస్తున్నాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ పార్వతీశం, ఆర్డీవో శ్రీనివాసరావు, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాష, తహసీల్దార్లు దినేష్ రాఘవేంద్ర, సీతారామయ్య, సుభాని పాల్గొన్నారు.



సిబ్బంది నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

సిబ్బంది సంక్షేమమే ధ్యేయం

పోలీసుల గ్రీవెన్స్ డేలో ఎస్పీ వకుల్ జిందాల్


గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది సంక్షేమానికి అండగా ఉంటానని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ప్రతి శుక్రవారం నిర్వహించే పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్ డే సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న వివిధ విభాగాల పోలీస్ సిబ్బంది తమ వ్యక్తిగత, సర్వీసు, బదిలీలు, ఇతర పాలనా సమస్యలపై వినతులు సమర్పించారు. వాటి పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సంక్షేమం, సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఎటువంటి భయాలకు తావివ్వకుండా సిబ్బంది తమ వినతులు, సమస్యలను నేరుగా ఎస్పీ కార్యాలయానికి వచ్చి తెలియజేయవచ్చన్నారు. సిబ్బంది సమస్యలు పరిష్కారమైతేనే వారు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించగలరన్నారు. అన్ని స్థాయిల సిబ్బంది విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజల్లో నమ్మకం, భరోసా కలిగించే విధంగా వ్యవహరించి, ఉత్తమమైన పోలీస్ సేవలు అందించడానికి కృషి చేయాలన్నారు.

కమ్యూనిస్టు దిగ్గజం స్టాలిన్‌బాబు ఇక లేరు

- ఆల్ ఇండియా ఎల్ఐసీ ఏజంట్స్ అసోసియేషన్ సెక్రటరీగా సేవలు
- సీపీఐ నేత చంద్ర రాజేశ్వరరావుతో సన్నిహిత సంబంధాలు
- నారాయణ, ముప్పాళ్ల ఆయన శిష్య బృందమే
- నేడు గుంటూరులో అంత్యక్రియలు

8

పట్టాలెక్కనున్న అమృత్ 2.0



నరసరావుపేటలోని కత్తవ చెరువు

పురపాలక సంఘాల్లో అమృత్ 2.0 పథకం పనులు పట్టాలెక్కనున్నాయి. రెండు సార్లు వాయిదా పడిన టెండర్లు ఎట్టకేలకు తిరిగి నిర్వహించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో టెండర్లు నిర్వహించేందుకు పబ్లిక్ హెల్త్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. రానున్న నాలుగు రోజుల్లో టెండర్లు నిర్వహించనున్నట్లు సదరు అధికారులు తెలిపారు. రూ.975.56 కోట్లు వ్యయంతో పనులు చేపట్టనున్నారు. పనులకు వినియోగించే మెటీరియల్ కొత్త ప్రామాణిక రేట్లు ప్రకారం టెండర్ నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

- టెండర్ నిర్వహణకు అనుమతి
- రూ.975.56 కోట్లతో పనులు

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని గుంటూరు నగరంతో సహా మునిసిపాల్టీల్లో అమృత్ పథకం కింది 54 పనులకు రూ.975.56 కోట్ల వ్యయం చేయనున్నారు. ఈ పనులన్నింటిని ఒకే టెండర్ కింద (మిగతా 6వ పేజీలో)



అమృత్ పథకంలో ప్రతిపాదించిన పిడుగురాళ్ల చెరువు

చేపట్టాల్సిన పనులు ఇలా..

- నీటి పథకాల విస్తరణ, చెరువుల అధునికీకరణ, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం.
- రానున్న 25 ఏళ్లలో పెరిగే జనాభాకు అనుగుణంగా తాగు నీటి పథకాల విస్తరణ.
- 24/7 నీటిని సరఫరా చేసే దిశగా నీటి పథకాల అభివృద్ధి, మురుగునీటి సమస్యలపై దృష్టి సారించడం.
- పట్టణాల్లో భూగర్భ జలాల పెంపు, చెరువుల పూడిక తీత, కట్టల పటిష్టత, వీటిపై వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం.
- పట్టణాల్లో వైసీపీ ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన సెంటు స్థలం కాలనీలకు తాగు నీటి సరఫరా, పైపులైన్లు, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, గృహాలకు కుళాయి కనెక్షన్‌లు.

మున్సిపాల్టీల వారీగా అమృత్ 2.0 నిధులు ఇలా..

మున్సిపాల్టీ	నిధులు (కోట్లలో)
నరసరావుపేట	29.42
చిలకలూరిపేట	161.30
దాచేపల్లి	49.62
పిడుగురాళ్ల	36.26
గురజాల	18.62
సత్తెనపల్లి	0.72
మాచర్ల	37.53
గుంటూరు	381.03
మంగళగిరి,తాడేపల్లి	68.21
తెనాలి	61.61
పొన్నూరు	22.10
చీరాల	32.98
బాపట్ల	25.32
రేపల్లె	45.74
అద్దంకి	5.10



2024లో చిలకలూరిపేట వద్ద జరిగిన బస్ ప్రమాదం (పాత చిత్రం)

ట్రావెల్స్.. టెర్రర్

- కర్నూలు ఘటనతో ఉలికిపాటు
- బస్సు ప్రయాణంపై భయాందోళనలు
- ప్రైవేటు సర్వీసులపై కొరవడుతున్న నిఘా
- నిబంధనలపై కఠినంగా ఉండాలంటున్న ప్రయాణికులు

గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆకర్షణీయమైన రంగులు, విద్యుత్ దీపాల వెలుగుల్లో కనిపించే ట్రావెల్స్ బస్సుల్లో ప్రయాణాలపై భయాందోళనలు నెలకొంటున్నాయి. గతంలో ఎన్నో ఘటనలు చోటు చేసుకున్నా అటు ట్రావెల్స్ నిర్వాహకులు.. ఇటు అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాల పరంపర కొనసాగుతోంది. కర్నూలు సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న బస్సు దహనం ఘటన నిదర్శనంగా కనిపిస్తోంది. రైళ్లలో రిజర్వేషన్లు దొరక్క, ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేక పోవడంతో ఎక్కువ మంది ట్రావెల్స్‌పై ప్రయాణాలకు మొగ్గుచూపుతున్నారు. ఇదే అదునుగా వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నం నగరాలకు ట్రావెల్స్ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా బస్సులు నడుపుతున్నారు. ఆయా బస్సులు ప్రమాదాల బారిన పడుతున్నా తప్పనిసరి పరిస్థితుల్లో వాటినే ప్రయాణికులు ఆశ్రయిస్తున్నారు. ఎలాగోలా సర్దుకుంటే తొందరగా గమ్య స్థానాలకు చేరుకోవచ్చన్న ప్రయాణికులు ఆశతో ట్రావెల్స్ నిర్వాహకులు జేబులు నింపుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో కొన్ని ట్రావెల్స్ నిర్వాహకులు నిబంధనలకు పాతర వేస్తున్నారు.

తప్పించుకునే అవకాశం మృగ్యం..

ట్రావెల్స్ బస్సుల్లో ఏదైనా ప్రమాదం జరిగితే తప్పించుకునే అవకాశం ఉండటంలేదు. దీంతో ప్రయాణికులు బస్సులోనే సజీవ దహనం అవుతున్న సంఘటనలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. 2024 మే 15 తెల్లవారుజామున చీరాల నుంచి హైదరాబాదు వెళ్తున్న ట్రావెల్స్ బస్సు పర్చూరు చిలకలూరిపేట మధ్య టిప్పర్ లారీ ఢీకొట్టి మంటలు చెలరేగి ఆరుగురు సజీవ దహనమయ్యారు. తాజాగా కర్నూలులో జరిగిన ఘటనలో 20 మంది సీట్లలోనే కాలిపోయారు. ఇలా ప్రమాదాలు జరిగినప్పుడు బస్సులో పొగలు వ్యాపించి ఎటు వెళ్లాలో, ఎలా తప్పించుకోవాలో తెలియని పరిస్థితుల్లో మంటల్లో మాడిమసైపోతున్నారు. ఎమర్జెన్సీ డోర్‌లో నుంచి అందరూ తప్పించుకోలేకపోతున్నారు. దీంతో మహిళలు, పిల్లలు, వృద్ధులు మృతి చెందుతున్నారు. అద్దాలు పగలగొట్టడానికి కావాల్సిన పరికరాలు అందుబాటులో లేకపోవడం కూడా మృతుల సంఖ్య పెరగడానికి కారణమని తెలుస్తుంది.

నిబంధనలు గాలికి...

ట్రావెల్స్ బస్సులకు సంబంధించి 2024 ఏప్రిల్‌లో ఏఐఎస్ 119 గైడ్‌లెన్స్ అందుబాటులోకి తెచ్చింది. అయితే నిర్వాహలు వాటికి పాతరేస్తున్నారు. పరిమితికి మించి విండోలు క్లోజ్ చేసి అదనపు సీట్లు వేస్తున్నారు. వెనుక సర్వీస్ డోరు తొలగిస్తున్నారు. ఐదు ఎమర్జెన్సీ విండోలు ఉండాలి కానీ పట్టించుకోవడంలేదు. ఇద్దరు డ్రైవర్లు ఉండాలి. నిర్ణీత సమయాన్ని అనుసరిస్తు వారు డ్రైవింగ్ చేయాలి. అలాగే ఫిట్‌నెస్ పరీక్షలు జరగాలి. అయితే ఇవేవీ అమలు కావడంలేదు. కొందరు అధికారులు మామూళ్ల మత్తులో ట్రావెల్స్ బస్సులను పట్టించుకోవడం లేదు. కొన్ని ట్రావెల్స్ యాజమాన్యాలు సీట్లు బుక్ చేయడంలో చూపుతోన్న శ్రద్ధ ప్రయాణికుల రక్షణపై చూపడం లేదన్న విమర్శలు ఉన్నాయి. రక్షణ చర్యల్లో ఆర్టీవో అధికారులు కఠినంగా వ్యవహరిస్తే ప్రమాద ఘటనలు ఉండవని ప్రయాణికులు తెలిపారు.

ఎండ.. వాన

కళ్లు చెదిరేలా ఎండ.. అంతలోనే నల్లని కారు మబ్బులు కమ్మేయడం. ఆపై ఆకాశం గర్జించినట్లు మేఘాలు నీటిని కుమ్మరిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా ఈ విచిత్ర పరిస్థితి గుంటూరు, బాపట్ల జిల్లాల్లో అత్యధికంగా పల్నాడు జిల్లాలో అక్కడక్కడ కనిపించింది. శుక్రవారం కూడా పలు ప్రాంతాల్లో ఇదే విధంగా ఎండ మండించగా అంతలోనే భారీగా వర్షం పడింది. మళ్లీ అంతలోనే వర్షం ఆగిపోగా సూర్యుడు దర్శనమిచ్చాడు. క్లౌడ్ బరెస్ట్ అయిందా అన్నట్లు అక్కడక్కడ భారీగా వర్షం పడింది. వాన పడదని బయటకు వచ్చిన ప్రజలు కుంభవృష్టిలా పడిన చినుకులతో తడిసిముద్దయ్యారు. వర్షంతో కొన్నిప్రాంతాల్లోని వీధులు చెరువుల్లా మారగా మరికొంత దూరంలో ఆ ఆనవాళ్లు లేవు. ఈ విచిత్ర పరిణామాలతో రైతులు నిండిమునిగారు. చేతికంది వచ్చిన వరి, పత్తి తదితర పంటలు నీట మునిగాయి. కొన్నిరోజులుగా కురుస్తోన్న వర్షాలతో దిగుబడులు తగ్గిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- క్లౌడ్ బరస్ట్‌ను తలపించేలా వానలు
- వరి పైరుకు రోజురోజుకు పెరుగుతున్న నష్టం
- 27 నుంచి మళ్లీ వర్షాల హెచ్చరికతో రైతుల్లో వణుకు
- నిజాంపట్నంలో కొనసాగుతున్న మూడో నెంబరు హెచ్చరిక

తెనాలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ద్రోణి ప్రభావంతో శుక్రవారం కూడా కొన్ని ప్రాంతాల్లో వర్షం పడింది. మరికొన్ని ప్రాంతాల్లో ఎండ కాసింది. మూడు రోజులుగా వదలకుండా వర్షం పడగా శుక్రవారం ఉదయం సూర్యుడు కనిపించాడు. దీంతో వర్షం పోయిందని రైతులు సంతోషించారు. పంట నష్టం కొంత తగ్గుతుందని ఆశపడ్డారు. అయితే వారి సంతోషం క్షణకాలం కూడా నిలువలేదు. ఎండ వచ్చిందనుకునేలోపే భారీగా వర్షం పడింది. శుక్రవారం సాయంత్రం వరకు ఇదే తరహా పరిస్థితి కనిపించింది. మధ్యాహ్నం లోపు కురిసిన వర్షాలకు పట్టణాలు, గ్రామాలు (మిగతా 8వ పేజీలో)



పెదనందిపాడు వద్ద మిరప పైరులో నిలిచిన వర్షపు నీరు

27 నుంచి జిల్లా స్కూల్ గేమ్స్ ఎంపికలు

గుంటూరు(క్రీడలు) అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి నవంబరు 3 వరకు అండర్ 19 బాల బాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి నరసింహారావు పేర్కొన్నారు. యోగ పోటీలు ఈనెల 27న రావెల జిల్లా పరిషత్ పాఠశాలలో, క్యారమ్స్, త్రో బాల్, రోప్ స్కిప్పింగ్ పోటీలు 28న చుండూరు ఏపీ ఎస్ డబ్ల్యూ ఆర్ జూనియర్ కళాశాల లో, హాకీ, టెన్నికాయిట్ పోటీలు 29న నందిగామ జిల్లా పరిషత్ పాఠశాలలో, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నవంబర్ 1న దుర్గి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, హ్యాండ్ బాల్ పోటీలు 3 న నరసరావుపేట సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాలలో జరగనున్నట్లు తెలిపారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 10 గంటలకు ఎంపికలకు హాజరు కావలసిందిగా కోరారు.

మిర్చి అమ్మకాలపై వాతావరణం ఎఫెక్ట్

● యార్డులో మూడు రోజులుగా తగ్గిన కొనుగోళ్లు

● 50 శాతం వరకు తగ్గిన విక్రయాలు

గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ముసురు వాతావరణంతో గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మిర్చి యార్డులో లావాదేవీలు తగ్గాయి. గత మూడు రోజుల నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోంది. గత వారం వరకు రోజుకు 50 వేలకు పైగా మిర్చి టిక్కీలు విక్రయానికి రైతులు తీసుకురాగా.. దీపావళి పండగ సందర్భంగా నాలుగు సెలవు దినాలు రావడం, ఆ తర్వాత నిత్యం ముసురు వర్షం కురుస్తుండటంతో బయ్యర్లు కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో దాదాపుగా సగానికి సగం శాతం మిర్చి అమ్మకాలు తగ్గాయి. మళ్లీ శని, ఆదివారం యార్డులో మిర్చి లావాదేవీలకు సెలవు దినాలు. ఈ నేపథ్యంలో వ్యాపారులంతా.. వచ్చే వారం నుంచి మార్కెట్ ఊపందుకోవాలని కోరుకొంటున్నారు. అయితే ఈ నెల 28వ తేదీ వరకు వర్షాలు విస్తారంగా కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో ట్రేడర్ల ఆశలు తీరే పరిస్థితి కనిపించడం లేదు.

మిర్చికి ప్రస్తుతం అన్‌సీజన్ అయినప్పటికీ కోల్డ్‌స్టోరేజ్‌లలో ఉన్న నిల్వలు కారణంగా రోజుకు 50 వేలకు పైగా టిక్కీలను బయ్యర్లు కొనుగోలు చేసి ఎక్స్‌పోర్టు చేస్తున్నారు. దీంతో ధర కూడా మెల్లగా పెరుగుతోంది. క్వాలిటీ బాగా ఉన్న మిరపకాయలకు క్వింటా రూ.16 వేల వరకు ధర లభిస్తోంది. సీజన్‌లో కేవలం రూ. 8 వేల నుంచి రూ. 10 వేల మధ్యనే ధర వచ్చింది. ఈ నేపథ్యంలో కొంతలో కొంతైనా నిలదొక్కుకోగలుగుతున్నామని రైతులు భావిస్తున్నారు. అయితే వరుస సెలవుదినాలు, ముసురు వర్షం కోల్డ్‌స్టోరేజ్‌ల నుంచి సరుకు బయటకు తీయనీయకుండా ఆటంకాలు కలిగిస్తున్నాయి. ఒక పక్క డిసెంబరు నెల సమీపిస్తుండటం, మరోవైపు కోల్డ్‌స్టోరేజ్‌లలో ఇంకా 38 లక్షలకు పైగా మిర్చి టిక్కీలు నిల్వ ఉండడంతో.. రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇందుకు కారణం డిసెంబరు నుంచి కర్నూలు జిల్లా రైతులు కొత్త మిర్చి పంటని విక్రయానికి తీసుకురానున్నారు.

ఈ నెల 22న 31,782 మిర్చి టిక్కీలను రైతులు యార్డుకు తీసుకురాగా అందులో 29,896 విక్రయం జరిగాయి. 23న 35,492 టిక్కీలు తీసుకురాగా 36,297 టిక్కీలు అమ్ముడయ్యాయి. శుక్రవారం 38,284 టిక్కీలు తీసుకురాగా 34,239 విక్రయమయ్యాయి. గత కొన్ని వారాలతో పోల్చితే ఈ వారం కనీసం 2.50 లక్షల మిర్చి టిక్కీలు విక్రయం జరగాల్సి ఉంది. సెలవులు, వాతావరణంలో మార్పులు కారణంగా 90 వేల టిక్కీల విక్రయం మాత్రమే జరిగింది. దీని వలన కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వలు తగ్గడం లేదు. మరోవైపు మార్కెట్ ఫీజు వసూళ్ల పైనా ప్రభావం చూపుతోంది. ఈ ఏడాది మిర్చి యార్డుకు మార్కెట్ ఫీజు రూపంలో రూ. 110 కోట్లకు పైగా టార్గెట్‌ని మార్కెటింగ్ శాఖ విధించింది. ఆ లక్ష్యానికి చేరుకోవాలంటే కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వలు విక్రయం జరగాలి. ఈ నేపథ్యంలో వాతావరణం అనుకూలించాలని అంతా కోరుకొంటున్నారు.

ఏఎన్‌యూ తాత్కాలిక వీసీగా కె.గంగాధరరావు బాధ్యతలు



తాత్కాలిక వీసీ ఆచార్య కె.గంగాధరరావు

ఏఎన్‌యూ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మరోమారు తాత్కాలిక వీసీగా కె.గంగాధరరావును నియమిస్తూ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ శుక్రవారం ఏఎన్‌యూ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఉత్తర్వులు జారీచేసింది. కొన్ని రోజులుగా వర్సిటీకి వీసీ లేక ఎక్కడ వేసినా గొంగడి అక్కడే అన్న చందంగా పరిపాలన కొనసాగుతోంది. ముఖ్యమైన ఫైల్స్, జీతాలు ఆగిపోయాయి. ఎప్పుడూ లేని విధంగా వీసీ చాంబరుకు రాకపోకలు బంద్ అయ్యాయి. శాశ్వత వీసీగా ఎస్వీ సత్యనారాయణ రాజు బాధ్యతలు చేపట్టేందుకు సమయం పట్టే అవకాశం ఉన్నందున.. తాత్కాలిక వీసీ కోసం రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి కొన్ని రోజుల క్రితం ఉన్నత విద్యాశాఖకు లేఖ వెళ్లినట్లు సమాచారం. కె.గంగాధరరావు తాత్కాలిక వీసీగా బాధ్యతలు చేపట్టారు. శాశ్వత వీసీ వచ్చేంత వరకు ఆయన ఆ పదవిలో కొనసాగుతారు. ఆగిపోయిన కొన్ని ముఖ్యమైన ఫైల్స్ పై సంతకాలు చేసినట్లు సమాచారం. రెక్టార్ శివరామ్‌ప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కావూరి శ్రీనివాసరావు, ఉన్నతాధికారులు వీసీకి అభినందనలు తెలిపారు.

అమరావతి - బెల్లంకొండ రహదారికి రూ.25 కోట్లు

పెదకూరపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అమరావతి నుంచి బెల్లంకొండ రహదారి నిర్మాణానికి రూ.25 కోట్లు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శుక్రవారం తెలిపారు. నెల రోజుల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, బీసీ జనార్దన్‌రెడ్డిని కలసి నిధులను విడుదల చేయాలని కోరినట్లు వెల్లడించారు.

ప్రభుత్వాస్పత్రిలో కార్పొరేట్ వైద్యం

● సమీక్ష సమావేశంలో తూర్పు ఎమ్మెల్యే నసీర్



సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, రమణ యశస్వి

గుంటూరు మెడికల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి మహర్దశ తీసుకువస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, జీజీహెచ్ అభివృద్ధి సంఘం కో-చైర్మన్ మొహమ్మద్ నసీర్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో వైద్యులు, విభాగాధిపతులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు ప్రభుత్వాస్పత్రిలో కార్పొరేట్ వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం సమావేశంలో.. వివిధ అంశాలను ఆయన సమీక్షించారు. ఆగస్టు సమీక్షలో విభాగాధిపతులు ఆసుపత్రికి కొన్ని వైద్య పరికరాలను సమకూర్చాలని కోరగా.. రాష్ట్రంలో ఇతర ఆసుపత్రులలో వాడకుండా నిరుపయోగంగా ఉన్న 21 వైద్య పరికరాలను ప్రభుత్వం ద్వారా గుంటూరు జీజీహెచ్‌కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, విభాగాధిపతులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం వైద్యులు ఎమ్మెల్యేకు పలు సమస్యలు వివరించారు. పరికరాలు, సిబ్బంది కొరత వంటి అంశాలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వీటిపై ఎమ్మెల్యే నసీర్ స్పందిస్తూ.. ఆసుపత్రిలో సమస్యలపై సమగ్ర నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అత్యవసర విభాగంలో వచ్చే రోగులకు సత్వరం సేవలు అందించాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో అన్ని విభాగాల వైద్యులు ప్రణాళిక ద్వారా సజావుగా నడిచేలాగా చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ అత్యవసర విభాగం నుంచి రోగుల్ని వార్డుకు తరలించేందుకు ఆరుగురిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర వైద్య విభాగాన్ని వైద్య సిబ్బంది నిరంతరం పర్యవేక్షించే విధంగా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి సంఘం సభ్యులు డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్, కార్పొరేటర్ పోతురాజు సమత, వైద్యులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ

జిల్లా కార్యాలయము, కలెక్టరేట్ కాంపౌండ్, గుంటూరు.

గోనె సంచుల రవాణా నిమిత్తము టెండరు ప్రకటన

టెండరు నోటీస్ నెం. Mktg/Gunny Contract/KMS 2025-26 తేది :25.10.2025

ఖరీఫ్ మరియు రబీ 2025-26 కాలమునకు గుంటూరు జిల్లా లోని గోనె సంచులను (ఖాళీ గోనె సంచులు/ బేళ్ళు) నిల్వ చేసిన గోదాముల నుండి గుర్తించబడిన రైస్ మిల్లులకు/ రైతు సేవా కేంద్రాలకు, రైతు సేవా కేంద్రాల నుండి ఫార్మ్ గేటు వద్దకు మరియు రైలు గోదాముల (రైల్వే గూడ్స్ షెడ్) నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ వారికి చెందిన గోదాములకు, రవాణా చేయడానికి ఆసక్తి కలిగిన సంస్థలు/ వ్యక్తులు నుండి సీల్డ్ టెండర్లు కోరడమైనది.

టెండరు ఫారములు నియమ నిబంధనల పత్రములకు రూ. 6,000/- బ్యాంకు డ్రాఫ్ట్ రూపములో ఏదైన షెడ్యూల్ మరియు జాతీయం చేయబడిన బ్యాంకులు నుండి జిల్లా మేనేజర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థకు గుంటూరులో చెల్లింపబడునట్లుగా దాఖలు చేసి టెండర్ ఫారం మరియు సంబంధిత పత్రములను అన్ని పనిదినములలో జిల్లా మేనేజర్, గుంటూరు వారి కార్యాలయము నందు పొందగలరు.

(1) టెండర్ ఫారం పొందు తేదీలు : 25.10.2025 ఉదయము 10.30 గం.ల నుండి 31.10.2025 మధ్యాహ్నం 12.00 గం.ల వరకు

(2) టెండర్ ఫారంలు స్వీకరించు చివరి తేది: 31.10.2025 సాయంత్రము 4.00 గం.ల వరకు

(3) టెండర్లు తెరుచు తేదీ : 01 .11.2025 ఉదయము 11.00 గం.లకు (టెక్నికల్ బిడ్) మధ్యాహ్నం 12.30 గం.లకు (ఆర్థిక బిడ్)

(4) టెండర్ ప్రాసెస్ జరుగు ప్రదేశము : జిల్లా సంయుక్త కలెక్టర్ వారి కార్యాలయం, కలెక్టర్ ఆఫీస్, గుంటూరు.

సదరు టెండర్లు పరిశీలన అనంతరము రద్దు చేయుటకు, తిరస్కరించుటకు మరియు కొత్తగా టెండర్లు పిలుచుటకు సంయుక్త కలెక్టర్, గుంటూరు వారికి పూర్తి అధికారము కలదని తెలియచేయడమైనది. వివరములకు కొరకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు : 9963479159 & 7702003567.

సం/- జిల్లా సంయుక్త కలెక్టర్ మరియు ఎక్స్ అఫీషియో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ లిమిటెడ్, గుంటూరు జిల్లా.

భారీ వర్షానికి వర్సిటీ ప్రధాన దారులన్నీ జలమయం



నిలబడిపోయిన వర్షపు నీరు

ఏఎన్‌యూ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రధాన దారులన్నీ జలమయమయ్యాయి. చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. పరీక్ష భవనం, హిందీ విభాగం ఎదుట మోకాళ్ల లోతు నీరు నిల్వ ఉంటోంది. దీంతో ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోందని చెబుతు న్నారు. రోడ్లకు ఇరువైపులా సైడ్ కాల్వలు నిర్మించి సమస్యను పపరిష్కరించాలని వారు కోరుతున్నారు. చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

భార్యను చంపిన భర్తకు..

జీవిత ఖైదు, రూ.1000 జరిమానా

గుంటూరు(లీగల్), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): భార్యను గొడ్డలితో నరికి చంపిన కేసులో నేరం రుజువురు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు, రూ.1000ల జరిమానా విధిస్తూ గుంటూరు జిల్లా ప్రధాన న్యాయాధికారి బి.సాయి కల్యాణ చక్రవర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. సంతనూతలపాడు మండలం గురిజేపల్లికి చెందిన నిందితుడు నూతలపాటి వెంకటేశ్వర్లు తన భార్య నూతలపాటి మౌనికపై అనుమానం పెంచుకోవడంతో పాటు..తన తండ్రి వివాహ సమయంలో ఆమె పేరుపై రాసిన సెంటున్నర స్థలం తిరిగి ఇవ్వనన్నందుకు ఈ దారుణానికి ఒడిగట్టాడు. కూలి పనులు చేసుకుంటూ వట్టిచెరుకూరు మండలం సౌపాడు ఎస్సీ కాలనీలోని అత్తింటిలోనే వెంకటేశ్వర్లు భార్యతో కలిసి నివాసం ఉంటున్నాడు. వీరిద్దరికీ ఇది మూడో వివాహం. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. 2017 జనవరి 9న అత్తమామలు పక్క ఊరికి పొలం పనులకు వెళ్లగా.. వెంకటేశ్వర్లు, మౌనికల మధ్య గొడవ జరిగింది. వెంకటేశ్వర్లు గొడ్డలితో మౌనిక తలపై నరకగా.. ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో వెంకటేశ్వర్లు అక్కడి నుంచి పరారయ్యాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు మౌనిక మంచం మీద చనిపోయి ఉండటం చూశారు. మృతురాలి తండ్రి వీరయ్య ఫిర్యాదు మేరకు వట్టిచెరుకూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అదే నెల 12న నిందితుడుని అదుపులోకి తీసుకున్నారు. హత్యకు ఉపయోగించిన గొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు. చేబ్రోలు సీఐ జి.రవికుమార్ కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ.. న్యాయాధికారి తీర్పు చెప్పారు. ఉమ్మడి గుంటూరు జిల్లాల ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్ ఎండీ బర్కత్ అలీ ఖాన్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

పట్టాలెక్కనున్న అమృత్ 2.0

(5వ పేజీ తరువాయి)

నిర్వహిస్తారు. అయా పనులు పూర్తి చేస్తే పురపాలక సంఘాల్లో తాగు, మురుగు నీటి కష్టాలు తీరుతాయి.

చామ్ పద్ధతిలో పనులు

రాష్ట్రంలోనే తొలిసారిగా అమృత్ పథకం 2.0 కింద ప్రగతి పనులను నూతన విధానంలో చేపనున్నారు. రాయితీ హైబ్రీడ్ యాన్యుటీ మోడల్(చామ్) కింద పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విధానంలోనే టెండర్లు నిర్వహిస్తున్నారు. జాతీయ రహదారుల నిర్మాణంలో వినియోగించిన పీపీపీ తరహాలోనే చామ్ విధానం కూడా ఉంది. 50 శాతం నిధులు ప్రభుత్వం ఇస్తుంది. 50 శాతం నిధులు కాంట్రాక్టర్ భరించాలి. సదరు సంస్థ ఖర్చు చేసే నిధులను వడ్డీతో కలిపి 40 వాయిదాల్లో ప్రభుత్వం చెల్లిస్తుంది. ప్రముఖ నిర్మాణ రంగ సంస్థ ప్రతిపాదించిన పనులు స్వయంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. సదరు సంస్థ టెండరు దాఖలు చేసేందుకు సమాయత్తమవుతున్నట్లు 15, 16 ఆర్థిక సంఘం నిధులు కూడా ఖర్చు చేస్తారు. మునిసిపాల్టీలు కూడా నిర్ణయించిన నిధులను వినియోగించాల్సి ఉంది.


సమీక్షలో ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, రమణ యశస్వి

ప్రభుత్వాస్పత్రిలో కార్పొరేట్ తరహా వైద్యం

- సమీక్షలో తూర్పు ఎమ్మెల్యే నసీర్
- అన్ని విభాగాలను పటిష్టం చేస్తున్నాం

గుంటూరు మెడికల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వాస్పత్రికి మహ ర్దశ తీసుకువస్తామని తూర్పు ఎమ్మెల్యే, జీజీహెచ్ అభివృద్ధి సంఘం కో చైర్మన్ నసీర్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో వైద్యులు, విభాగాధిపతులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. పేదలకు ప్రభుత్వాస్పత్రిలో కార్పొరేట్ వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. అనంతరం సమావేశంలో వివిధ అంశాలను ఆయన సమీక్షించారు. ఆగస్టు నెలలో జరిగిన సమీక్ష లో విభాగాధిపతులు ఆస్పత్రికి కొన్ని వైద్య పరికరాలను సమకూర్చాలని కోరగా, రాష్ట్రంలో ఇతర ఆస్పత్రుల్లో వాడకుండా నిరుపయోగంగా ఉన్న 21 వైద్య పరికరాలను ప్రభుత్వం ద్వారా గుంటూరు జీజీహెచ్‌కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, విభాగాధిపతులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం వైద్యులు ఎమ్మెల్యేకు పలు సమస్యలు వివరించారు. పరికరాల కొరత, సిబ్బంది లోపం, మత్తు విభా గం, నర్సింగ్ విభాగాల్లో ఉద్యోగులు తక్కువగా ఉండటం వంటి అంశాలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వీటిపై ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఆస్పత్రిలో సమస్యలన్నీ సమగ్ర నివే దిక సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో ఆస్పత్రి అభివృద్ధి సంఘం సభ్యులు డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్, ఆరో డివిజన్ కార్పొరేటర్ పోతురాజు సమత, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సురక్ష యాప్‌తో నకిలీ మద్యం కట్టడి

- పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే నసీర్

గుంటూరు(కార్పొరేషన్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం కట్టడి చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఎక్సైజ్ సురక్ష యాప్‌ను తీసుకొచ్చిందని, దీని ద్వారా నకిలీ మద్యం కట్టడి చేయొచ్చని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం ఎక్సైజ్‌శాఖ అధికారులతో కలిసి ఎక్సైజ్ సురక్ష యాప్‌తో రూపొందించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాణ్యమైన మద్యం అందించడం కోసమే ప్రభుత్వం ఈ సురక్షయాప్ అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఈ యాప్‌ను ప్రతి మద్యం షాపు వద్ద అతికిస్తారన్నారు. మీరు కొనుగోలు చేసిన మద్యం నాణ్యమైనదా లేక నకిలీదా అని తెలుసుకునేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందన్నారు. మద్యం బాటిల్ కొనుగోలు చేసే ప్రతిఒక్కరు బాటిల్‌ను స్కాన్ చేస్తే తెలిసిపోతుందన్నారు. కార్యక్రమాల్లో ఎక్సైజ్ శాఖ గుంటూరు అధికారి అరుణకుమారి, ఏఈ ఎస్ మారయ్యబాబు, వన్ టౌన్ సీఐ లత, సిబ్బంది పాల్గొన్నారు.

నందివెలుగు రోడ్డులో కల్వర్టు నిర్మాణం అత్యవసరం

గుంటూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి పూర్తి సహకారం అందించాలని రోడ్లు, భవనాలశాఖ కమి షనర్ కృష్ణబాబును తూర్పు ఎమ్మెల్యే నసీర్ కోరారు. సెక్రటేరియట్లో ఆయనను కలిసి ఎమ్మెల్యే నసీర్ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. తూర్పు నియోజకవర్గంలో కల్వ ర్టులు, రోడ్ల నిర్మాణాలపై నివేదిక సిద్ధం చేశామని వివరించారు. వీటికి తగిన అనుమతు లు ఇచ్చి సహకరించాలని కోరారు. నందివెలుగు వెళ్లే రోడ్డులోని జాకీర్ హుస్సేన్‌నగర్ వద్ద కల్వర్టు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని విన్నవించారు. భారీ వర్షాల సమయంలో ఈ కల్వర్టు వద్ద ముంపు కారణంగా ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడతున్నారని తెలిపారు. మణిపురం బ్రిడ్జి మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఎమ్మెల్యే నసీర్ వినతి మేరకు రోడ్లు, భవనాల శాఖ కమిషనర్ సానుకూలంగా స్పందించారు.

వర్షం నీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలి

- కమిషనర్ పులి శ్రీనివాసులు


సమావేశంలో ప్రసంగిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు (కార్పొరేషన్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర శివారు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, కచ్చా డ్రెయిన్లు ఏర్పాటు చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధి కారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ కృష్ణబాబుకాలనీ, మున్సిపల్ ఎంప్లాయీస్ కాలనీ, పెద్ద పలకలూరు రోడ్డు, కంకరగుంట ఆర్యూబీ తదితర ప్రాంతాలను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటన లో ఈఈలు కోటేశ్వరరావు, వేణు, పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొ న్నారు.

అనుమతి లేకుండా మార్కెట్ నిర్వహణ సరికాదు

గుంటూరు నగరపాలక సంస్థపరిధిలో నిర్దేశిత అనుమతులు లేకుండా హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ నిర్వహణ చట్టప్రకారం సరికాదని, అటువంటి వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకొని నిర్వహించుకోవాలని కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. శుక్రవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో అనధికారికంగా హోల్‌సేల్ కూరగాయల వ్యాపారం చేస్తున్న వ్యాపారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు తీసుకోకుండా హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ నిర్వహించడాన్ని అనుమతించబోమన్నారు. అలాగే అధికారికంగా బహిరంగ వేలంలో కొల్లిశారద మున్సిపల్ హోల్‌సేల్ మార్కెట్‌లో షాప్‌లు పొందిన వారి హక్కులను కాపాడడం, వారి సంక్షేమానికి కృషి చేయడం జీఎంసీ భాధ్యత అని అన్నారు. అనధికార వ్యాపారాలు చేస్తున్న వారు జీఎంసీకి సహకరించి, తాము వ్యాపారం చేసుకోవడానికి అనుకూలమైన స్థలానికి నిర్దేశిత అనుమతులు తీసుకొని, తగిన మౌలిక వసతులు ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేసుకోవాలని, అనుమతులు త్వరగా ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఆర్‌వోలు రవికిరణ్ రెడ్డి, సాదిక్‌బాషా, ఆర్‌ఐలు ఖాజావలి, కాశయ్య, వ్యాపా రులు సత్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లలో పరిశుభ్రత పాటించాలి

నగరపాలక సంస్థ పరిధిలోని అన్నక్యాంటీన్లలో పరిశుభ్రత పాటించాలని, పర్యవేక్షణ కోసం విధులు కేటాయించిన వార్డు సచివాలయ కార్యదర్శులు పర్యవేక్షణ చేసి, ఏమైనా లోపాలు గుర్తిస్తే నివేదిక ఇవ్వాలని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మిర్చియార్డులోని అన్న క్యాంటీన్‌ని కమిషనర్ పరిశీలించి, ఆహారం తీసుకుం టున్నవారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు.

నిబంధనల ప్రకారమే పత్తి కొనుగోళ్లు జరగాలి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్ధేశించిన నిబంధనల మేరకే పత్తి కొనుగోళ్లు జరగాలని రైతు, కౌలు రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు లక్ష్మీపురంలోని సీసీఐ కార్యాలయంలో జీఎం రాజేంద్రషాకు వారు వినతిపత్రం అందజేసి, సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కొనుగోళ్లలో దళారుల ప్రమేయం లేకుండా చూడాలన్నారు. వర్షాల నేపథ్యంలో తేమ శాతాన్ని 15 శాతం వరకు పరిగణించి పత్తి సేకరణ చేయాలన్నారు. మద్దతు ధరను క్వింటాల్‌కు రూ.12వేలకు పెంచి, కొనుగోలు చేయాలని కోరారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకోనే విధానాన్ని విరమించుకోవాలన్నా రు. కొనుగోలు కేంద్రాలు ప్రతి మండల కేంద్రాల్లోని మార్కెట్ యార్డులోనే కొనసాగించి, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. జీఎంను కలిసిన వారిలో రైతు సంఘ రాష్ట్ర కార్యదర్శి కేవీవీ ప్రసాదు, కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, శివశంకర్, కౌలు రైతు సంఘ నాయకులు కె అజయ్‌కుమార్, బొట్ల రామకృష్ణ, బిక్కి శ్రీనివాసరావు ఉన్నారు.

పత్తి రైతుల రిజిస్ట్రేషన్ ప్రారంభించాలి

- కలెక్టర్ అన్సారియా ఆదేశాలు


పత్తి, ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ అన్సారియా

గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియని సత్వరమే ప్రారంభించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. పత్తి, ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సేవాకేంద్రం(ఆర్‌ఎస్‌కే) వారీగా రైతులతో సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు తెలియజేయాలన్నారు. ప్రాంతాల వారీగా పత్తి ఉత్పాదకత వివరాలు సమర్పించాలని ఆదేశించారు. పత్తి సేకరణలో తరచూ తలెత్తే సందేహాలను స్పష్టంగా నివృత్తి చేయాలన్నారు. కలెక్టరేట్‌లో ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

నేటి నుంచే రైతుల రిజిస్ట్రేషన్

వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకుడు సత్యనారాయణ చౌదరీ మాట్లాడుతూ రైతుల రిజిస్ట్రేషన్ ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభిస్తామని చెప్పారు. జిల్లాలో 94,290 మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి రాగలదని అంచనా వేస్తున్నామని చెప్పారు. పొడ వైన ప్రధాన పత్తికి క్వింటాల్‌కు రూ.8,110, పొట్టిగా ఉన్న దూది పింజలు క్వింటాల్‌కు రూ.7,710 మద్దతు ధర సీసీఐ ప్రకటించిందన్నారు. తాడికొండ, మేడికొండూరు, ఫిరంగిపురం, ప్రత్తిపాడు ప్రాంతాల్లో ఎక్కువగా దిగుబడి వస్తుందని తెలిపారు. పత్తి రైతుల సంఘం ప్రతినిధి హరనాథబాబు మాట్లాడుతూ ప్రాంతాల వారీగా మ్యాపింగ్ అయిన మిల్లులు యాప్‌లో కనిపించడం వలన ప్రయోజనం కలుగుతుందన్నారు.

రైతులు కపాస్ కిసాన్ యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలి

ప్రత్తి రైతులు కపాస్ కిసాన్ యాప్‌ను వారి మొబైల్ ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకోవాలని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) జనరల్ మేనేజర్ రాజేంద్ర షా కోరారు. 2025-26 పంట సంవత్సరంలో సీసీఐకి మద్దతు ధర (ఎంఎస్‌పీ)తో పత్తి విక్రయాలకు 'కపాస్ కిసాన్' మొబైల్ యాప్‌లో నమోదు కావాలన్నారు. ఈ యాప్ గూగుల్ ప్లేస్టోర్, ఐవోఎస్‌లలో లభ్యమౌతుందన్నారు. యాప్‌ను డౌన్లోడ్ చేసుకున్న రైతులు మొబైల్ ఫోన్ నంబరుకు వచ్చే ఓటీపీ ద్వారా లాగిన్ కావాలని పేర్కొన్నారు. మద్దతు ధరకు విక్రయానికి యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని ఆయన సూచించారు. సీసీఐ ద్వారా ప్రత్తి రైతుల ప్రయోజనాల కోసం, ఎంఎస్‌పీ పథకం కింద ప్రయోజనాలను పొందడానికి పత్తి రైతులు అందరు మొబైల్ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ధాన్యం సేకరణపై కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం సేకరణలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై రైతులకు స్పష్టంగా అవగాహన కల్పించాలని అన్నారు. పౌర సరఫరా సంస్థ జిల్లా మేనేజర్ కే తులసి ధాన్యం సేకరణ ప్రక్రియ వివరాలు తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ అయితా నాగేశ్వర రావు, వ్యవసాయ మార్కెట్ యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక, జిల్లా పౌర సరఫరాల అధికారి విజయ లక్ష్మి, రవాణా అధికారి శ్రీహరి పాల్గొన్నారు.

ఏపీ జ్యుడీషియల్ అకాడమిని సందర్శించిన కలెక్టర్

గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ చింతలపూడి పురుషోత్తం కుమార్‌ను కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిం దాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరి మండలం కాజా వద్ద ఉన్న ఏపీ జ్యుడీ షియల్ అకాడమీని శుక్రవారం కలె క్టర్, ఎస్పీ తొలిసారిగా సందర్శించారు. ఈ సందర్భం గా డైరెక్టర్‌ని కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ కార్యక్రమంలో తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహా, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్‌ఎస్‌కే ఖాజావలి, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ

గుంటూరు(తూర్పు), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మాసాంతపు తనిఖీలో భాగంగా ఆర్డీవో కార్యాలయంలోని ఈవీఎమ్ గోడౌన్‌ను కలెక్టర్ తమీమ్ అన్సారియా శుక్రవారం తనిఖీ చేశారు. రిజిస్టర్ నిర్వహణ, బందోబస్తు ఇతర అంశాలను పరిశీలించి ఆమె సంతృ ప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఖాజావలి, ఆర్డీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు మహాసభలకు జస్టిస్ ఎన్వీ రమణకు ఆహ్వానం


జస్టిస్ ఎన్వీ రమణకు ఆహ్వానపత్రికను అందజేస్తున్న గజల్ శ్రీనివాస్, శ్రీమాశర్మ

గుంటూరు(తూర్పు), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర సారస్వత పరిషత్, ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో వచ్చే ఏడాది జనవరి 3 నుంచి 5వ తేదీ వరకు గుంటూరులో నిర్వ హించే 3వ ప్రపంచ తెలుగు మహాసభలకు సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణను పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, శ్రీమాశర్మ ఆహ్వానం పలికారు. మహాసభల్లో భాగంగా జనవరి 4న నిర్వహించే తెలుగు వైభవ సభకు ముఖ్యఅతిథిగా రావాలని కోరారు.

సంక్షేమ భాస్కరుడు ఎస్ఆర్ శంకరన్

- మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్

గుంటూరు(కార్పొరేషన్), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ శంకరన్ సంక్షేమ భాస్కరుడిగా, ఐఏఎస్ గాంధీగా, పేదల పెన్నిధిగా నేటి సమాజంలో చిరస్థాయిగా నిలిచిపోతా రని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం గుంటూరులోని జనచైతన్య వేదిక హాల్లో ఎస్ఆర్ శంకరన్ జయంతి సందర్భంగా తొలుత ఆయన చిత్ర పటానికి పూలమాలేసి నివాళులర్పించారు. అనంతరం 'బ్యూరోక్రసీ నాడు - నేడు' అనే అంశంపై జరిగిన చర్చాగోష్టికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రసంగిస్తూ అధికార యంత్రాంగంలో అవినీతిని రూపుమాపడానికి ఎన్నికల సంస్కరణలు రావాలని, ప్రజా చైతన్యంతో మంచి ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలని కోరారు. ఎస్ఆర్ శంకరన్ జీవిత మంతా అణగారిన ప్రజల సంక్షేమం కోసం కృషి చేశారన్నారు. శాసనమండలి మాజీ సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు ప్రసంగిస్తూ ప్రపంచంలో పాలనా వ్యవస్థకు మ్యాక్స్ వెబర్, ఉడ్రో విల్సన్లు పునాదులు వేశారని, 1990 వరకు భారత దేశంలో పాలన వ్యవస్థ స్వతం త్రంగా కొనసాగించిందని, ఆ తర్వాత సరళీకరణ ఆర్థిక విధానాలతో సంపద పోగుబడి, రాజకీయాలు ధనమయంగా మారడంతో బ్యూరోక్రసీ అవినీతిమయంగా మారిందన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ ఎస్ఆర్ శంకరన్ ఐఏఎస్ అధికారిగా వెట్టి చాకిరి నిర్మూలన, సంక్షేమ హాస్టల్స్ ఏర్పాటు, ఐటీడీఏ ఏర్పాటు, జోగిని వ్యవస్థ, బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలన, పనికి ఆహార పథకం లాంటి ఎన్నో సంక్షేమ పథకాలను అమలుచేస్తూ బలహీన వర్గాలకు తోడ్పడే విధంగా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ డీఏఆర్ సుబ్రహ్మణ్యం, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకుడు కొరివి వినయ్‌కుమార్, జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. ధనుంజయరెడ్డి, కొరటాల శేషగిరిరావు, ఎస్ఆర్ శంకరన్ ప్రజాసంక్షేమ సంఘాల అధ్యక్షుడు బత్తుల కోటేశ్వరరావు, విశ్రాంత ఏఎస్పీ చలపతిరావు, టీ సేవకుమార్, రేట్ పేయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణరెడ్డి, కొండవీడు కోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు.


శంకరన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఏక్తా యాత్రను జయప్రదం చేయండి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఈనెల 31న నిర్వహిస్తున్న ఏక్తాయాత్రను జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు పిలుపునిచ్చారు. లాలుపురంలో వాజ్‌పేయి భవ నంలో శుక్రవారం పదాధికారులు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యాత్రలో కూటమి ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలన్నారు. మండల కేంద్రాల్లోనూ వల్లభాయ్ పటేల్ జయంతి నిర్వహించాలని కార్యకర్తలకు ఆదేశాలి చ్చారు. అనంతరం కర్నూలు, బస్సు ప్రమాదంలో చనిపోయిన వారికి సంతాపాన్ని తెలిపా రు. ఈ సమావేశంలో దేసు సత్యనారాయణ, తోట శ్రీనివాసరావు భజరంగ్ రామకృష్ణ, దర్శనపు శ్రీనివాస్, తాడువాయి రామకృష తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నవీకరణ కేంద్రాలను ఉపయోగించుకోవాలి

గుంటూరు(విద్య), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు విద్యాశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులకు ఈనెల 30 వరకు ఉచిత ఆధార్ నవీకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్టేట్ నోడల్ ఆఫీసర్ చెరుకూరి రమేష్ తెలిపారు. వెనిగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆధార్ నవీకరణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. జిల్లాలోని ఎంఈవోలు, ప్రధానోపాధ్యా యులు తమ తమ పరిధిలోని విద్యార్థులకు ఆధార్ అప్డేషన్ పూర్తి చేయించాలని సూచించారు. కాకాని మండలంలో 300 మంది విద్యార్థులకు అప్డేషన్ చేయవలసిన అవసరం ఉన్నదని తప్పక అన్ని పూర్తి చేయాలని కేంద్ర నిర్వాహకులను కోరారు.

రాష్ట్ర పోటీల్లో రాణించిన జిల్లా క్రీడాకారులు

గుంటూరు(క్రీడలు), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా నున్న జిల్లా పరిషత్ పాఠశాలలో రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి 23 వరకు జరిగిన అం డర్ 19 బాలబాలికల రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో జిల్లా క్రీడాకారులు 3 బంగారు పతకాలు 4 రజిత పతకాలు 7 కాంస్య పతకాలను సాధించారు. బాలుర ఫ్రీస్టైల్ విభాగంలో పి. సాగర్, జి.చరణ్ తేజ బంగారు పతకాలను, ఎం.రాజ్‌కుమార్, జి.అంబేద్కర్ రజిత పత కాలను పొందారు. గ్రీకో రోమన్ కేటగిరిలో ఉదయ్‌కిరణ్-బంగారు, కె.గోపీచంద్-రజిత, ఎం వెంకటేశ్వర్లు, టి.నవీన్, బి.పవన్‌కుమార్-కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. బాలి కల విభాగంలో సీహెచ్ దీపిక-రజిత, కె.హారిక, ఎం.స్టెల్లా, ఇ.దివ్య, కె.బ్లెస్సిలు-కాంస్య పతకాలను సాధించారు. ఈ పోటీల్లో అత్యంత ప్రతిభను కనపరచి బంగారు పతకాలను సాధించిన ముగ్గురు క్రీడాకారులు నవంబరు 1 నుంచి 5 వరకు హరియాణలో జరగను న్న జాతీయ స్కూల్ గేమ్స్ కుస్తీ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా స్కూల్ గేమ్స్ అధ్యక్షురాలు, జిల్లా ఒకేష నల్ విద్యాశాఖ అధికారి జె.పద్మ క్రీడాకారులను, వారికి శిక్షణ ఇచ్చిన శిక్షకులను అభినంది స్తూ జాతీయ పోటీల్లో కూడా ప్రతిభ కనపరిచి జిల్లాకు పేరు, ప్రఖ్యాతలు తేవాలని ఆకాంక్షించారు.

టెట్‌పై రివ్యూ పిటిషన్ వేయడంలో జాప్యం తగదు

గుంటూరు(విద్య), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం విధుల్లో ఇన్‌సర్వీస్ ఉపాధ్యా యులు అందరూ టెట్ ఉత్తీర్ణత పొందాలన్న సుప్రీంకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం జా ప్యం లేకుండా రివ్యూ పిటిషన్ వేయాలని ఏపీటీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కంకర గుంటలోని ఎస్టీయూ కార్యాలయం లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుధీర్‌బాబు మాట్లాడుతూ ఇన్ సర్వీస్ టీచర్లు టెట్‌పై ఆందోళన చెందుతున్నారని వెంటనే సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ వేయ డంతో పాటు పార్లమెంట్‌లో విద్యాహక్కు చట్టం సవరణకు కృషి చేయాలని కోరారు. కార్య క్రమంలో జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు, ప్రధాన కార్యదర్శి డి.కె.సుబ్బారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ కమతం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా శనివారం ఏటుకూరు రోడ్డు, డంపింగ్‌యార్డు, జగదాంబ ఎస్టేట్, సింహపురి ఎస్టేట్, విజయవాడ టైల్స్ రోడ్డు, నల్లచెరువు, అడపా బజార్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ రాజమో హన్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరా అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

సామాజిక మాధ్యమాల కేసుల్లో నిందితులపై కఠిన చర్యలు

- ఎస్పీ వకుల్‌జిందాల్
- వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు ఎస్పీ ఆదేశాలు


వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల కేసుల్లో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పోలీస్ కార్యాలయం నుంచి జూమ్ యాప్ ద్వారా జిల్లాలోని పోలీస్ అధికారుల తో సామాజిక మాధ్యమాల కేసుల్లో పురోగతిపై జూమ్ వీడియో కాన్ఫరెన్స్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల్లో విభేదాలు, అశాంతి సృష్టించే విధంగా అవాస్తవ ప్రచారాలు, విద్వేషపూరిత పోస్టులు, వీడియోలు ప్రచారం చేసే వ్యక్తులను గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలు వేగంగా తీసుకోవాలని ఆదేశించారు. నిందితులు విదేశాల్లో ఉంటే, వారిని విచారణకు హాజరుకావడానికి లుక్ అవుట్ సర్క్యులర్ జారీ చేయాలన్నారు. కేసుల దర్యాప్తుకు అవసరమైన సాంకేతిక సమాచారాన్ని ట్విట్టర్, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సంస్థల సహకారంతో తక్షణమే సేకరించాలన్నారు. ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ రిపోర్టులు త్వరగా పొందుతూ చార్జ్‌షీట్లు న్యాయస్థానాలకు సమర్పించాలన్నారు. విచారణ దశలో ఉన్న కేసులను వేగంగా ముందు కు తీసుకెళ్లాలన్నారు. న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా అనుభవజ్ఞులైన న్యాయ నిపుణుల సూచనలు పాటించాలన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు సాంకేతిక బృందాలు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తు న్నాయన్నారు. వివాదాస్పద పోస్టులు లేదా వీడియోలను ప్రచారం చేసే వారిపై తక్షణమే కేసులు నమోదు చేయాలి.

ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డుకు చెక్కు అందజేత

గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు అగ్నిమళ్ళ వెంకటేశ్వరరావుకి పోలీస్ శాఖ నజరానా ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం రూ.2 లక్షల 27 వేల 910 చెక్కును ఎస్పీ వకుల్ జిందాల్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వెంకటేశ్వరరావు 44 సంవత్సరాలుగా గుంటూరు జిల్లా పోలీస్ విభాగంలో హోంగార్డుగా నిబద్ధతతో ప్రజలకు సేవలు అందించడం గర్వించదగిన విషయమన్నారు. ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, శేష జీవితం ఆయురారోగ్యాలతో, ఆనందంగా గడపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటు న్నట్లు ఎస్పీ తెలిపారు. జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డులు తమ ఒక రోజు వేతనం మొత్తాన్ని ఉద్యోగ విరమణ పొందిన సహోద్యోగికి నజరానా రూపంలో అందించడం హృదయానికి హత్తుకునే అంశమని ఎస్పీ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సురేష్, హోంగార్డు ఎస్‌సీవోలు హెడ్ కానిస్టేబుల్ కరిముల్లా, మాణిక్యరావు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.


'డిజిటలైజ్డ్ ఉమన్' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

మహిళా శక్తికి 'డిజిటలైజ్డ్ ఉమన్' ఊతం

- పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మహిళా శక్తిని మరింత ఉన్నతికి తీసుకెళ్లేం దుకు 'డిజిటలైజ్డ్ ఉమన్' కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. గుంటూరు మాజేటి కల్యాణ మండపంలో నిర్వహించిన 'డిజిటలైజ్డ్ ఉమెన్' కార్యక్రమాన్ని ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ నేటి మహిళాశక్తిని చూస్తూ ఎంతో ఆనందంగా ఉందన్నారు. వినూత్నమైన ఆలోచనతో డిజిటల్ వేదిక ద్వారా మహిళల ఎంపవర్‌మెంట్‌కి అశ్లేష చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఇది కేవలం ఒక కార్యక్రమం కాదు, మహిళల ఆర్థిక స్వావలంబనకు దారి చూపించే ఒక ఉద్యమమని కొనియాడారు. మహిళలకు వ్యాపారాలు, నైపుణ్యాలు,సేవలను డిజిటల్ రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లే ఈ కొత్త వేదిక లో వివిధ రంగాల మహిళలు భాగస్వామ్యం కావడం ఎంతో సంతోషకరమని ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. డిజిటల్ ప్రపంచంలో మహిళలు కూడా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, ఇంట్లో నుంచే వ్యాపారాలు అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. దేవిరెడ్డి నేతృత్వంలో పలు విభాగాల్లో మహిళలు సంఘమిత్రలుగా ముందుకు వస్తుండటం మహి ళా శక్తికి నిదర్శనమని అభినందించారు.

- ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటా

నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని, ఏ చిన్న సమస్య వచ్చినా తనకు చెప్పుకోవచ్చని, వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఎమ్మెల్యే మాధవి చెప్పారు. పశ్చిమ కార్యాలయంలో శుక్రవారం ఆమె ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. మీడియాతో మాట్లాడుతూ తాను ప్రతిరోజు ప్రజల మధ్య అందుబాటులో ఉంటానని, ప్రజలు, పార్టీ శ్రేణుల సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నానని తెలిపారు.


విద్యార్థినికి మందులు అందజేస్తున్న డాక్టర్ రాజకుమారి

విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు

గుంటూరు మెడికల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అహల్య ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖ మాజీ మంత్రి డాక్టర్ శనక్కాయల అరుణ, గైనకాలజిస్ట్ డాక్టర్ శనక్కాయల రాజకుమారి పర్యవేక్షణలో గురువారం నాజ్‌సెంటర్‌లోని ప్రభుత్వ మహిళా కళాశాలలో విద్యార్థినులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో సుమారు 400 మం ది విద్యార్థినులకు ఉచితంగా ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. వారికి అవసరమైన మందు లు అందజేశారు. అనంతరం నిత్యజీవితంలో ఆరోగ్య సంరక్షణపై అనుసరించాల్సిన విధా నాలు, జీవనశైలిపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గైనకాలజిస్ట్ డాక్టర్ రాజకుమారి వివ రించారు. ఆరోగ్యకరమైన సమతుల ఆహారం ఏవిధంగా తీసుకోవాలో విద్యార్థినులకు అవ గాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్నకుమారి, వార్డెన్ అనూష, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ధాత్రికుమారి, లత, ఎన్‌సీసీ ప్రెసిడెంట్ అనూష, అహల్య హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

శాలివాహన సమన్వయ సంఘం వనసమారాధన వాయిదా

- సంఘం అధ్యక్షుడు ఆర్ శ్రీనివాసరావు

గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26వ తేదీన జరగాల్సిన శాలివాహన సమన్వయ సంఘం వనసమారాధన కార్యక్రమాన్ని అకాల వర్షాల దృష్ట్యా వాయిదా వేసి నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు రాజవరపు శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలి పారు. తిరిగి నవంబరు 16వ తేదీన ఆదివారం పేరేచర్లలోని మామిడి తోటలో కార్యక్ర మాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ విషయాన్ని శాలివాహనులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సస్యరక్షణే..పంటకు శ్రీరామరక్ష

● పొలాల్లో నిలిచిన వర్షపు నీరు ● రైతులకు జాగ్రత్తలు సూచిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు



జేడీ అయితా నాగేశ్వరరావు



కొల్లూరులో వర్షపునీటిలో నానుతున్న వరి పంట(ఫైల్‌ఫొటో)

గుంటూరు సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు రైతులు పంటల రక్షణకు కొన్ని జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ అయితా నాగేశ్వర రావు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో అల్పపీడనం వల్ల కురుస్తున్న అధిక వర్షాలకు వివిధ పంటల్లో సూచించిన యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. పొలం నుంచి మురుగు నీటిని తొలగించాలన్నారు. రాబోవు రెండు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పంట పొలాల్లో మందులను పిచికారి చేయడం తాత్కాలికంగా వాయిదా వేయాలన్నారు. వరి పిలకలు కట్టే దశలో నీరు బయటకు తీసిన వెంటనే ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ వేయడం వల్ల పంట త్వరగా పుంజుకుంటుందని చెప్పారు. నష్టం చాలా వరకు తగ్గుతుందన్నారు.

● దుబ్బు చేసే దశలో ఉన్న పంటలో బ్యాక్టీరియా ఎండు ఆకు తెగులు ఆశించే అవకాశం ఉందన్నారు. నివారణకు 0.2 గ్రాములు ప్లాంటమైసిన్ మందును లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని చెప్పారు. నత్రజని ఎరువును మోతాదుకు మించి ఉపయోగించకూడదని, రెండవ దఫా ఎరువును వేసుకోవడం వాయిదా వేసుకోవాలని తెలిపారు.

● కాండం కుళ్లు రావడానికి కూడా అవకాశం ఎక్కువగా ఉందన్నారు. నివారణకు 2.5గ్రాముల కార్బెండజిమ్, మ్యాంకోజెబ్ శిలీంధ్ర నాశక మందును లేదా మి.లీ వాలిడామైసిన్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు.

● అగ్గి తెగులును గమనించినట్లయితే 0.6 గ్రాముల ట్రై సైక్లోజోల్ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని పేర్కొన్నారు.

● పత్తి పంటలో ప్రస్తుతం వర్షాలు తగ్గిన తర్వాత ఎకరాకు 25 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రసాయనిక ఎరువులను పైపాటుగా పంటకు మొక్కల మొదళ్లలో 7-10 సెం.మీ పాదులు తీసి రసాయనిక ఎరువులను వేసి మట్టితో కప్పాలని సూచించారు.

● ముంపునకు గురైన పంట త్వరగా కోలుకోవడానికి 19:19:19 లేదా 13-0-45 లేదా 10 గ్రాముల యూరియా లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలన్నారు.

● పిండి నల్లి రావడానికి అవకాశం ఎక్కువగా ఉందని, ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా రెండు మిల్లీలీటర్ల ఫిప్రోనిల్ మందును లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. నేల ద్వారా వ్యాప్తి చెందే ఎండు తెగులు నివారణకు 3 గ్రా. కాపర్ - ఆక్సీక్లోరైడ్ లేదా ఆల్టర్నేరియా ఆకు మచ్చ తెగులుని నివారణకు 2.5 గ్రాముల కార్బెండజిమ్, మ్యాంకోజెబ్ శిలీంధ్రనాశక మందును లీటరు నీటిలో కలిపి నేల బాగా తడిచేటట్టు వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలన్నారు.

● మినుము పొలములో మురుగు నీరు ఎప్పటికప్పుడు తీసివేయాలని, వర్షం ఆగిన తరువాత లేత పైరులో సాయంత్రం వేళలో ఒక ఎకరానికి 15 కేజీల యురియా, 10 కేజి ల పొటాష్ వేయాలన్నారు. జింక్, ఇనుము లోపాలు (ముఖ్యంగా నల్ల నేలల్లో) అధిక వర్షాల కారణంగా సంభవించే అవకాశం ఉందన్నారు. వర్షాలు ఆగిపోయిన తరువాత సూక్ష్మ పోషకాలను అందించాలన్నారు. పెసర పంట పొలంలో ఉన్న మురుగు నీరు ఎప్పటికప్పుడు తీసివేయాలన్నారు. వర్షం ఆగిన తర్వాత లేత పైరులో సాయంత్రం వేళలో ఎకరానికి 15 కేజీల యురియా, 10 కేజీల పొటాష్ వేయాలని పేర్కొన్నారు. రాత్రి ఉష్ణోగ్రత తగ్గి మంచు పడడం వల్ల పెసరలో బూడిద తెగులు ఆశించవచ్చని, రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దీని నివారణకు హెక్సాకొనజోల్ 2.మి.లీలు లేదా ప్రోపికొనజోల్ మి.లీ లేదా కార్బండిజం గ్రాము.. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని చెప్పారు.

కమ్యూనిస్ట్ దిగ్గజం స్టాలిన్‌బాబు ఇక లేరు!

● ఆల్ ఇండియా ఎల్ఐసీ ఏజంట్స్ అసోసియేషన్ సెక్రటరీగా సేవలు
● సీపీఐ నేత చండ్ర రాజేశ్వరరావుతో సన్నిహిత సంబంధాలు
● నారాయణ, ముప్పాళ్ల ఆయన శిష్య బృందమే
● నేడు గుంటూరులో అంత్యక్రియలు



స్టాలిన్‌బాబుకు నివాళులర్పిస్తున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు, జంగాల అజయ్‌కుమార్, విషణ్ణ వదనంలో కుటుంబ సభ్యులు



బొప్పూడి స్టాలిన్‌బాబు (ఫైల్ ఫొటో)

గుంటూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు, ఆల్ ఇండియా ఎల్ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ పూర్వ కార్యదర్శి బొప్పూడి స్టాలిన్ బాబు(83) శుక్రవారం తుదిశ్వాస విడిచారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శ్యామలా నగర్‌లోని నివాసంలో కన్నుమూశారు. ఆయన తండ్రి బొప్పూడి కోటయ్య స్వాతంత్య్ర సమరయోధుడు. గుంటూరు ఏసీ కళాశాలలో బీఏ చదివిన స్టాలిన్ బాబు విద్యార్థి దశ నుంచే కమ్యూనిస్టు సిద్ధాంతలపై మక్కువ చూపారు. సీపీఐ అనుబంధ విభాగం ఏఐఎస్ఎఫ్‌లో స్టాలిన్‌బాబు చురుకైన పాత్ర పోషించారు. సీపీఐ అగ్రనేత చండ్ర రాజేశ్వరరావుతో ఆయనకు ఎంతో గొప్ప అనుబంధం ఉంది. కమ్యూనిస్టు నేతలు కామ్రేడ్ ఎస్ఏ డాంగే, మినాజ్ కర్, పెరవలి కృష్ణయ్య, సుధాకర్‌రెడ్డి, నారాయణకు ఆయన అత్యంత సన్నిహితులుగా వ్యవహరించారు. 1970లో గుంటూరులో జరిగిన ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ జాతీయ మహాసభలను నిర్వహించడంలో చురుకైన పాత్ర పోషించారు. అలాగే విజయవాడలో జరిగిన సీపీఐ జాతీయ 10వ మహాసభలకి జనసేవాదళ్ రాష్ట్ర ఉప కమాండర్‌గా వ్యవహరించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యమంలో జైలు పాలవడమే కాకుండా.. పోలీసు లాఠీ దెబ్బలకు ప్రాణాలకు తెగించి మరీ ఆయన పోరాడారు. యువజన విద్యార్థి ఉద్యమాలకు వేగు చుక్కగా ఉండి వేలాది మంది విద్యావంతులైన యువకులను ఆకర్షించి సీపీఐ కార్యకర్తలుగా తీర్చిదిద్దడంలో స్టాలిన్‌బాబు కీలక పాత్ర పోషించారు. నాటి సీపీఐ అగ్ర నాయకులు కనపర్తి నాగయ్య, వల్లూరు గంగాధర్, మల్లయ్య లింగం, వేములపల్లి శ్రీకృష్ణ తదితర నేతలతో ఆయనకు బలమైన అనుబంధం ఉంది. ప్రస్తుత సీపీఐ జాతీయ నాయకులు కె.నారాయణ, రాష్ట్ర నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు తదితరులు ఈయన శిష్య బృందమే. 1968లో స్టాలిన్‌బాబుకు కొడాలి మరుద్వతితో వివాహం జరిగింది. ఆమె శ్రీవేంకటేశ్వర బాల కుటీర్ అనుబంధ సంస్థ చేతన చారిటబుల్ ట్రస్ట్ కార్య నిర్వహకురాలిగా వ్యవహరిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు మధుభారతి, కవిత. స్టాలిన్ బాబు మరణానంతరం నేత్రాలను శంకర నేత్రాలయకు దానం చేశారు. ఆయన మృతికి సీపీఐ సీనియర్ నేత నారాయణ, జాతీయ, రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, జి.ఈశ్వరయ్య సంతాపం తెలిపారు. గుంటూరులోని నివాసంలో ఆయన మృతదేహానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జంగాల అజయ్‌కుమార్, అకిటి అరుణ్‌కుమార్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తదితరులు నివాళలర్పించారు.

నేడు మహాప్రస్థానంలో అంత్యక్రియలు

కమ్యూనిస్టు నేత స్టాలిన్‌బాబు అంత్యక్రియలు శనివారం స్తంభాల గరువులోని మహాప్రస్థానంలో నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర నాయకులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు తెలిపారు. శ్యామలానగర్ 7వ లైనులోని స్వగృహం నుంచి కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు మధ్య అంతిమ యాత్ర ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

అంబేడ్కర్ చైర్‌ను సందర్శించిన ఎక్స్‌పర్ట్ కమిటీ

ఏఎన్‌యూ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చైర్‌ను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫౌండేషన్ న్యూఢిల్లీ నుంచి వచ్చిన ఎక్స్‌పర్ట్ కమిటీ శుక్రవారం సందర్శించింది. డైక్ సెంటర్‌కు చెందిన డాక్టర్ బీకే పాండే అంబేడ్కర్ చైర్ విభాగాన్ని పరిశీలించారు. ప్రొఫెసర్ ఆచార్య వై.అశోక్‌కుమార్ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన ఎవల్యూషన్ అండ్ ఇంటరాక్షన్ కార్యక్రమంలో గడిచిన ఐదేళ్లలో అంబేడ్కర్ చైర్ చేపట్టిన కార్యక్రమాలు, పబ్లికేషన్స్, పీహెచ్‌డీలు, సామాజిక కార్యక్రమాలు, సాధించిన అవార్డులను ప్రొఫెసర్ అశోక్‌కుమార్ వివరించారు. అలాగే అంబేడ్కర్ చైర్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టులతో పాటు నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. తద్వారా విభాగం పరిపూర్ణంగా కార్యక్రమాలు చేసే వీలు ఉంటుందని పాండే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పరిశోధకులతో పాండే మాట్లాడారు. పరిశోధనల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరిశోధనల ద్వారా సమాజానికి ఇచ్చే సందేశాలను ఆయన వారికి తెలియజేశారు. అంబేడ్కర్ చైర్ పనితీరును ఆయన అభినందించారు. అనంతరం ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం లను మర్యాద పూర్వకంగా కలిశారు. అంబేడ్కర్ చైర్ అభివృద్ధికి ఫౌండేషన్‌మరిన్ని నిధులు మంజూరు చేసి సహకరించాలని కోరారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కనపర్తి అబ్రహం లింకన్, సిబ్బంది డాక్టర్ వి.శ్రీనివాస్, అబ్రహం, వెస్లేరు, పరిశోధకులు పాల్గొన్నారు.

నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సాగర్ జలాశయం నీటి మట్టం శుక్రవారం నాటికి 587.10 అడుగులు ఉంది. ఇది 305.56 టీఎంసీ లకు సమానం. కుడి కాలువ ద్వారా 4,050, ఎడమ కాలువ ద్వారా 6,097, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,901, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 46,748 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 46,748 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

1.0701 ఎం.యూ విద్యుత్ ఉత్పత్తి

రెంటచింతల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ ప్రాజెక్ట్‌లో 2 యూనిట్లు ద్వారా గురువారం అర్థ రాత్రి 12 గంటల వరకు 1.0701 ఎం.యూ విద్యుత్ ఉత్పత్తి జరిగినట్లు ఎస్ఈ వెంకటరమణ, ఈఈలు చెప్పారు. ప్రాజెక్ట్‌కు చెందిన 20 రేడియల్ క్రస్ట్‌గేట్లకు గాను 2 గేట్లను మీటరు మేర ఎత్తి 8,468, టెయిల్ రేస్ చానల్ ద్వారా 8,704, మొత్తంగా 21,406 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నారు. ఎగువున సాగర్, ఎత్తిపోతల , హాలియా వాగుల నుంచి 33,292 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరు ఉండగా, ఇది 7.080 టీఎంసీలకు సమానమని చెప్పారు.



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

డెల్టా కాలువలకు 511 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుండి 52,889 క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. రిజర్వాయర్‌లో 11.5 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 52,378 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 511 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా, పశ్చిమ డెల్టాకు, గుంటూరు చానల్‌కు నీటి విడుదల నిలిపివేశారు.

ప్రాథమిక ఆర్థిక సూత్రాలే సుస్థిర స్వేచ్ఛకు పునాది

● ఆర్థిక శాస్త్రవేత్త పట్నాయక్



ఆచార్య పట్నాయక్

గుంటూరు విద్య అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టే ఐదు ప్రాథమిక సూత్రాలు. అభివృద్ధి, సమానత్వం, స్థిరత్వం, సామాజిక భద్రత, ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని జేఎన్‌టీయూ ప్రొఫెసర్ ఆచార్య ప్రభాస్ పట్నాయక్ అన్నారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో ఫ్రీడమ్ ఇన్ ది ఏజ్ గ్లోబలైజేషన్ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. గ్లోబలైజేషన్ యుగంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు మందగమనం దిశగా వెళ్తున్నాయని పేర్కొన్నారు. సంక్షోభం అంటే కేవలం ఆర్థిక క్షీణత కాదని, అది ప్రస్తుత వ్యవస్థను ప్రశ్నించే, మార్పును కోరుకునే దశ అని వివరించారు. గ్లోబలైజేషన్ ప్రభావంలో వ్యక్తిగత స్వేచ్ఛ క్షీణిస్తుందన్నారు. మరో ముఖ్య అతిథి విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ జ్ఞానం పంచుకున్నప్పుడే పెరుగుతుందని, ఒకరితో ఒకరు నేర్చుకోవడం, పరస్పర మేధో మార్పిడి సమాజ అభివృద్ధికి పునాది అవుతుందన్నారు. డీన్లు, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

ప్రైవేటు ట్రావెల్స్ అక్రమాలపై చర్యలు తీసుకోండి

● ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్

పెదకాకాని, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ట్రావెల్ సంస్థల అక్రమాలపై చర్యలు తీసుకోవాలని, కావేరి ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకోవాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నన్నపనేని శివాజీ, ముజఫర్ అహ్మద్ శుక్రవారం డిమాండ్ చేశారు. ఒడిశాలో కేవలం 43 సీటింగ్ కాంట్రాక్ట్ క్యారియర్ పర్మిషన్ తీసుకొని స్లీపర్ కోచ్‌గా మార్చి అక్రమాలకు పాల్పడిన కావేరి ట్రావెల్స్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రమాదంలో చనిపోయిన 19 మంది ప్రయాణికుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించే ఆర్టీసీ సంస్థలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోటార్ వాహనాల చట్టంలో సవరణలు చేసి ముంచేశారని విమర్శించారు. రాజకీయ నాయకుల బినామీ పేర్లతో నడుస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై రవాణా శాఖ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రమాదానికి గురైన కావేరి ట్రావెల్స్ బస్సు డిజైన్‌లో తప్పులు ఉన్నాయని.. బస్సు పెండింగ్ చలానాలు రూ.23,120 పెండింగ్ ఉన్నట్లు అధికారులు తెలియజేయడం ఆశ్చర్యాన్ని గురిచేస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థ ఆర్టీసీని బలోపేతం చేసి ప్రజలకి మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు.

ఏఐ రాకతో నాలుగో పారిశ్రామిక విప్లవం

● మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రెసిడెంట్ రాజీవ్ కుమార్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాజీవ్‌కుమార్, ప్రొఫెసర్ మధుమూర్తి, ఎమ్మెల్సీ ఆలపాటి

గుంటూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ల రాకతో మూడో పారిశ్రామిక విప్లవం మొదలవగా, కృత్రిమ మేధ(ఏఐ) రాకతో నాలుగో పారిశ్రామిక విప్లవం ప్రారంభమైందని మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రెసిడెంట్ రాజీవ్ కుమార్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా విశదలలోని ఎన్.ఆర్.ఐ ఇంజనీరింగ్ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన సాంకేతిక సదస్సుకు రాజీవ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సాంకేతికతలో నూతన ఒరవడులు, పరిశ్రమలకు విద్యార్థుల సన్నద్ధత అంశంపై ఆయన కీలకోపన్యాసం చేశారు. ముప్పై ఏళ్లకు పైగా మైక్రోసాఫ్ట్‌లో పని చేస్తున్నానని, బిల్ గేట్స్, స్టీవ్ బామర్, సత్య నాదెళ్ల వంటి ప్రముఖ సీఈవోలతో కలిసి పని చేశానని చెప్పారు. ఆర్థికాభివృద్ధి, జీడీపీ వృద్ధిలో కృత్రిమ మేధ కీలకంగా ఉంటోందన్నారు. కృత్రిమ మేధ ఎవరిని రీప్లేస్ చేయలేదు కానీ ఎవరికైనా సహాయకారిగా ఉంటుందన్నారు. అపజయం పాలైనప్పుడు చేతులెత్తేయడం కాకుండా మళ్లీ ప్రయత్నించి గెలవడం ముఖ్యమని విద్యార్థులను చైతన్య పరిచారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ మదుమూర్తి, ఎన్ఆర్ఐ విద్యా సంస్థల చైర్మన్ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

కపాస్ కిసాన్ యాప్ డౌన్ లోడ్ చేసుకోవాలి

● సీసీఐ మేనేజర్ రాజేంద్ర షా

గుంటూరు సిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) జనరల్ మేనేజర్ రాజేంద్ర షా కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2025-26లో పత్తిపంటకు సీసీఐ మద్దతు ధర పొందాలంటే.. కపాస్ కిసాన్ మొబైల్ యాప్‌లో నమోదు కావాలన్నారు. ఈ యాప్ ను డౌన్లోడ్ చేసుకున్న రైతులు మొబైల్ ఫోన్ నంబరుకు వచ్చే ఓటీపీ ద్వారా లాగిన్ కావాలన్నారు. మద్దతు ధరకు విక్రయానికి యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని చించారు.

ఏఎన్‌యూ ఇంజనీరింగ్ కళాశాల..

వర్క్‌షాపు ల్యాబ్‌లో చోరీ



ఏఎన్‌యూ ముఖద్వారం

ఏఎన్‌యూ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల వర్క్‌షాపులోని ఈఈఈ విభాగం ల్యాబ్‌లో చోరీ జరిగింది. చోరీ చేయాలనే ముందస్తు ప్రణాళికతో కొందరు వర్క్‌షాపు తాళం పగలగొట్టి లోనికి ప్రవేశించారు. అక్కడ సుమారు 30 పైగా బల్లల కింద ఉన్న కాపర్ వైర్లు ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. అలాగే మెకానికల్ వర్క్ షాపులోని రెంచీలు, బోల్ట్‌లు కూడా ఎత్తుకెళ్లినట్లు సమాచారం. విశ్వవిద్యాలయం తాత్కాలిక రెక్టార్ ఆచార్య శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం ల్యాబ్‌ను పరిశీలించారు. పెదకాకాని పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు వర్సిటీకి చేరుకుని ల్యాబ్‌ను పరిశీలించారు. అక్కడ పనిచేసే టెక్నీషియన్లు, అటెండర్లు, స్వీపర్లను విచారించారు. గతంలో ఇంజనీరింగ్ కళాశాల భవనాల కిటికీలకు అమర్చిన ఫ్రేమ్‌లను దొంగిలించారు. చోరీలు భద్రత వ్యవస్థ పటిష్టతను తేటతెల్లం చేస్తున్నాయి.

ఇంజనీరింగ్ విద్యార్థుల మధ్య ఘర్షణ

వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలోని కొందరు విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. ఒకరి మీద ఒకరు దాడి చేసుకున్నారు. దీన్ని సీరియస్‌గా తీసుకున్న వర్సిటీ అధికారులు విచారణకు ఆదేశించారు. ఓఎస్డీ ఆచార్య రవికుమార్, ఇంజనీరింగ్ కళాశాల తాత్కాలిక ప్రిన్సిపాల్ ఆచార్య లింగరాజు, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలు డాక్టర్ లావణ్యతో కమిటీని నియమించారు. నివేదిక ఆధారంగా ఘర్షణ పడిన విద్యార్థులపై చర్యలు తీసుకోనున్నారు.

పంచారామాలకు..

ఆర్టీసీ స్పెషల్ సర్వీసులు

● కార్తీక మాసం టూర్ ప్యాకేజీలు
● ప్రతి శని, ఆదివారం బయల్దేరేలా ప్రణాళికలు

గుంటూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రారంభంతో శివ భక్తుల కోసం ఆర్టీసీ పంచారామాలకు ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. పంచారామాలైన సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం, అమరావతిలో ఒక రోజులోనే దర్శించుకునేలా టూర్ ప్యాకేజీ సిద్ధం చేసినట్లు గుంటూరు-1 డిపో మేనేజర్లు రామకృష్ణ, 2 డిపో మేనేజర్ సీహెచ్ సునీత తెలిపారు. గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండు నుంచి ప్రతి శని, ఆదివారం రాత్రి 9.15 గంటలకు బయల్దేరేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. అంతేగాక 35 మంది యాత్రికులు ఉన్నట్లయితే వారు ఉన్న ప్రాంతానికే బస్సు వచ్చి ఎక్కించుకునేలా సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. రాత్రి గుంటూరు బస్టాండ్ నుంచి బయల్దేరి ఉదయం సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం నుంచి చివరగా అమరావతి పుణ్యక్షేత్రాలను దర్శించుకొని రాత్రి 9 గంటలకు గుంటూరు బస్టాండ్‌కు బస్సు చేరుతుందని తెలిపారు.

త్రిశైవ క్షేత్రాలకు స్పెషల్ సర్వీసులు...

అలానే త్రిశైవ క్షేత్రాలైనా యాగంటి, మహానంది, శ్రీశైలం పుణ్యక్షేత్రాలకు కూడా సర్వీసును ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రయాణికులు గుంటూరు -2 డిపో 73828 97115, గుంటూరు-1 కు 73828 89830 కు సంప్రదించవచ్చని కోరారు.

పంచారామాల చార్జీల వివరాలు

ఎక్స్‌ప్రెస్ - రూ. 870
అల్ట్రా డీలక్స్ - రూ.1,130
సూపర్ లగ్జరీ - రూ.1,180

త్రి శైవ దర్శన చార్జీలు

ఎక్స్‌ప్రెస్ - రూ.1080
అల్ట్రా డీలక్స్ - రూ.1,380
సూపర్ లగ్జరీ - రూ.1,440

బీజేపీ మీడియా రాష్ట్ర ప్రతినిధిగా రామకృష్ణ



తాడువాయి రామకృష్ణ

గుంటూరు(తూర్పు), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధిగా తాడువాయి రామకృష్ణ నియమితులైయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఉత్తర్వులు జారీ చేశారు. కీలక బాధ్యతలు అప్పజెప్పిన రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ, జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావుకు రామకృష్ణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎండ.. వాన

(5వ పేజీ తరువాయి)

జలమయమయ్యాయి. గురువారం వరకు పడిన వర్షంతో ఎక్కడికక్కడ పొలాలు నీటితో నిండిపోయాయి. పల్నాడు జిల్లా పరిధిలో వాగులు ఉధృతంగా ప్రవహించాయి. పల్నాడులో అధిక వర్షాలు పత్తి, మిర్చి రైతులను దారుణంగా దెబ్బతీశాయి. డెల్టాలో వరి రైతుల వెన్ను విరిచాయి. గురువారం పడిపోయిన విస్తీర్ణం కంటే రెట్టింపు చేలు నేలవాలాయి. ముసురు పట్టి ఉండటంతో కంకులు కూడా తాలుగా మారిపోతాయని రైతులు తెలిపారు. నేలవాలిన చేలల్లో ఎకరాకు రెండు నుంచి ఐదు బస్తాల వరకు దిగుబడిలో నష్టం ఏర్పడుతుందని రైతులు చెబుతున్నారు. పడిపోయిన వరిని పైకిలేపి కట్టించేందుకు ప్రయాస పడుతున్నారు. అల్పపీడనం బలహీనపడినా, వాతావరణంలో మార్పులు లేకపోవడంతో నిజాంపట్నం హార్బర్‌లో శుక్రవారం కూడా మూడో నెంబరు ప్రమాద హెచ్చరికను కొనసాగించారు. వాతావరణ శాఖ నుంచి సమాచారం వచ్చేవరకు అదే కొనసాగుతుందని పోర్టు అధికారులు చెప్పారు. అయితే సముద్రంలో వేటపై ఆంక్షలు ఇంకా సడలించలేదని, ఎవరూ సముద్రంలోకి వెళ్లటానికి వీలులేదని అధికారులు స్పష్టం చేశారు. ఇప్పటికే రైతులు కుదేలవగా ఈ నెల 27 నుంచి మళ్లీ భారీ వర్షాల హెచ్చరికలు వాతావరణ శాఖ చేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అధికారులు అప్రమత్తం..

వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో పల్నాడు జిల్లా పరిధిలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే మండల కేంద్రాల్లో కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటు చేయగా వాటిని కొనసాగించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కాగా శుక్రవారం పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. పలు గ్రామాల్లో వాగులు, వంకలు పొంగి పొర్లే అవకాశాలు ఉన్నందున ప్రజలు అటు వైపు వెళ్లరాదని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా పిల్లేరు, పొటేళ్ల వాగు పరివాహక ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు. కృష్ణానదీ పరివాహక గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ఆయా గ్రామాల వీఆర్ఏలు వారి వారి గ్రామాల్లో ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని అధికారులకు అందించాలంటూ ఆదేశాలు జారీ అయ్యాయి. కాగా వీడని వర్షాలతో పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి మొక్కలు ఎర్రబారాయని, వేరు కుళ్ళు పడ్డాయని, ఏపుగా పెరిగిన పత్తి వర్షపు నీటితో పూత, పిందె రాలి పోతుందని సాగుదారులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ధర లేక ఇబ్బందులు పడుతుండగా అధిక వర్షాలు మరింత ఇబ్బందుల్లోకి నెట్టి వేస్తున్నాయని తెలిపారు.



రేపల్లె జలమయమైన మున్సిపల్ ఆఫీస్ రోడ్డు

6,800 ఎకరాల్లో పంట నష్టం

మూడు రోజుల నుంచి బాపట్ల జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు శుక్రవారం సాయంత్రానికి శాంతించాయి. పంట నష్టాలపై ప్రాథమిక గణన చేపట్టిన వ్యవసాయశాఖ జిల్లాలో 6,800 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు తేల్చింది. భారీ వర్షాలతో 74 గ్రామాల పరిధిలో 5,010 మంది రైతులకు నష్టం వాటిల్లిందని అంచనా వేశారు. తుది నివేదికలో ఈసంఖ్య దాదాపు 11,000 ఎకరాల వరకు ఉండొచ్చని సమాచారం. జె. పంగలూరు మండలంలో 2,500 ఎకరాల్లో మినుము, మార్టూరు మండలంలో 1,200 ఎకరాల్లో మినుము, పత్తికి 750 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ తేల్చింది. ఇంకొల్లు మండల పరిధిలో పత్తి, మినుము కలిపి దాదాపు 750 ఎకరాల్లో పంట దెబ్బతిన్నది. రేపల్లె నియోజకవర్గంలో శుక్రవారం ఈదురు గాలులతో కూడిన వర్షంపడింది. దీంతో పట్టణంలోని ప్రధాన రహదారులు, పలు కాలనీలు జలమయ్యాయి. బస్సులు కూడా కదలకపోవడంతో దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్టాండ్‌కే పరిమితమయ్యారు. చెరుకుపల్లి, నగరం, నిజాంపట్నం, రేపల్లె మండలాల్లో అధికవర్షం పడింది. చెట్లు, విద్యుత్‌స్థంబాలు నేలవాలాయి.



పొన్నూరు జీబీసీ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

వీడని వర్షంతో ఆందోళన

గుంటూరు, తెనాలి, పొన్నూరు, పెదనందిపాడు తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. రాజధాని ప్రాంతంలోని గ్రామాలు, మంగళగిరి, తాడేపల్లి పట్టణాల్లో కూడా రోడ్లు వర్షపు నీటితో నిండాయి. ప్రధాన రోడ్లతో పాటు పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచి రోడ్లపై ప్రవహించాయి. ఇప్పటికే పత్తి, మినుము, సోయాబీన్, మొక్కజొన్న కోతదశలో ఉండగా వీడని వర్షంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మిరప నాట్లు వేసిన రైతులు మొక్కలు నీటిలో నానుతుండడంతో ఉరకెత్తి చనిపోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొన్నూరులో మధ్యాహ్నం వరకు ఏకధాటిగా కురిసిన వర్షంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

రైల్వే ప్రయాణికుడిపై ఆటోడ్రైవర్ దాడి

తెనాలి క్రైం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ వెళ్లడానికి తెనాలి రైల్వేస్టేషన్‌కి వచ్చిన ప్రయాణీకునిపై ఆటోడ్రైవర్ దాడిచేసిన సంఘటన గురువారం రాత్రి 11.30 గంటలకు జరిగింది. త్రీ టౌన్ పోలీసుల కథనం మేరకు.. హాఫ్‌పేటకు చెందిన మల్లెల దేవప్రియుడు రైల్వేస్టేషన్‌కి వచ్చి టిక్కెట్ తీసుకుని స్టేషన్ ముందు నిలబడి ఉండగా వేగంగా వచ్చిన ఆటో అతడిని ఢీకొట్టింది. దీనిపై ప్రయాణీకుడు ప్రశ్నించగా కొద్దిపాటి వాదులాట అనంతరం ఆటోడ్రైవర్ మరో ఆటోడ్రైవర్‌ని తీసుకునివచ్చి ఆ ప్రయాణీకుడిపై తీవ్రంగా దాడి చేశారు. ఈ సంఘటనపై రైల్వే ప్రయాణీకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆటో నెంబరు ఏపీ 36 డబ్ల్యుఎఫ్ 6178, ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైళ్ల పునరుద్ధరణకు జనరల్ మేనేజర్‌కు వినతి

తెనాలి అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): విజయవాడ- గూడూరు మార్గంలో గతంలో రద్దుచేసిన రైళ్లను పునరుద్ధరించాలని రోటరీ క్లబ్ ఆఫ్ వైకుంఠపురం ప్రధాన కార్యదర్శి జీవీ నారాయణ కోరారు. ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం పంపినట్లు శుక్రవారం విలేకరులకు చెప్పారు. కొవిడ్ కారణంగా రద్దుచేసిన తెనాలి-ఒంగోలు ప్యాసింజర్‌ను పునరుద్ధరించాలని, సాయంత్రం 6.15 గంటలకు వెళ్లే విజయవాడ ప్యాసింజర్ రద్దు చేయడంతో విజయవాడ-ఒంగోలు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాకినాడ పోర్టు-తిరుపతి ఎక్స్‌ప్రెస్ స్థానంలో విజయవాడ-ఒంగోలు ప్యాసింజర్ రైలును ఏర్పాటుచేయాలని, యాత్రికుల డిమాండ్ అధికంగా ఉంటే పుణ్యక్షేత్రాలైన శ్రీరంగం, మధురై, తంజావూరు, నాగూర్‌దర్గా, నాగపట్నం చర్చి చేరేందుకు చైన్నై యగ్మోర్ వరకు పొడిగించాలని కోరారు. విశాఖపట్నం కొల్లాం ఎక్స్‌ప్రెస్‌ను డైలీ సర్వీసు చేస్తూ కన్యాకుమారి వరకు నడపాలని, వెస్ట్ బుకింగ్ కౌంటర్ సమయాన్ని పెంచాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలి అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో 11 కేవీ లైన్ల మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపు కారణంగా శనివారం పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏడీఈ బి.అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పట్టణంలోని బుర్రిపాలెం రోడ్డు, గాంధీచౌక్, శివాజీచౌక్, కవిరాజా పార్కు, నందులపేట ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

ఒంగోలు క్రైం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఒంగోలు నగరం హౌసింగ్‌బోర్డ్ కాలనీలో శుక్రవారం జరిగింది. స్థానిక నగర శివారు ప్రాంతంలో ఉండే ఓ ఇంజినీరింగ్ కాలేజీలో చదువుకునే నలుగురు విద్యార్థులు హౌసింగ్ బోర్డు కాలనీలో రేకుల ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. అయితే ఇంటిలో ఎవరూలేని సమయంలో గుంటూరు జిల్లా తెనాలికి చెందిన బాపట్ల దిగ్విజయ్ సాయిమణికంఠ(22) ఇనుప కమ్మీకి టవల్‌తో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం విద్యార్థి తల్లిదండ్రులకు తెలియజేయగా వారు ఒంగోలు వచ్చి తమ కుమారుడి మృతదేహాన్ని తీసుకెళ్లారు. విద్యార్థి మృతికి గల కారణం తెలియాల్సి ఉంది.

రేపు బ్రాహ్మణ కార్తీక వన సమారాధన

తెనాలి అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వేదిక బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం బ్రాహ్మణ కార్తీక వన సమారాధన నిర్వహించనున్నారు. సమారాధన పోస్టర్లను శుక్రవారం రామలింగేశ్వరపేటలోని నృసింహ సదన్‌లో విడుదల చేశారు. సమాఖ్య అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, దాతల సహకారంతో నిర్మించుకున్న నృసింహ సదన్‌లో రెండో ఏడాది పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నిర్వహించే సమారాధన జయప్రదం చేయాలని కోరారు. ఏకాదశ రుద్రాభిషేకం, లలితా సహస్రనామం, విష్ణునామ సహస్ర పారాయణ, దామోదర పూజ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు. సమారాధనలో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు గంగాధర్, నారాయణమూర్తి, రాష్ట్ర సమాఖ్య నాయకులు పాల్గొంటారని తెలిపారు. కౌనిన్య సాయి, అనిల్‌కుమార్, రామేశ్వరరావు, శ్రీనివాసమూర్తి, ఆంజనేయులు, పద్మజ, కుందేటి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పాస్టర్లకు బియ్యం పంపిణీ

తెనాలి అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): టౌన్ పాస్టర్స్ సపోర్టు హెల్పింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాస్టర్లకు శుక్రవారం బియ్యం బ్యాగులు పంపిణీ చేశారు. అసోసియేషన్ సహకారంతో ప్రతి నెలా ఈ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నామని బ్రదర్ ఆనందన్న చెప్పారు. కార్యక్రమంలో రమేష్, దానియేలు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘ జిల్లా మహాసభ వాయిదా

తెనాలి అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పాల రైతుల సంఘ జిల్లా మహాసభలు వర్షాలు కారణంగా వాయిదా వేశామని రైతు సంఘం ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాసభ నిర్వహణ తేదీలను త్వరలో ప్రకటిస్తామని చెప్పారు.

నత్తనడకన ఆధార్ నమోదు

- కొన్నిచోట్ల సర్వర్, ఇంటర్‌నెట్ సమస్యలు
- సమయ పాలన పాటించని సిబ్బంది
- నమోదు కేంద్రం చుట్టూ తల్లిదండ్రుల ప్రదక్షిణలు



ఆధార్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి, ఆధార్‌కార్డు బయోమెట్రిక్ అప్‌డేట్ కోసం వచ్చిన చిన్నారులు

కొల్లిపర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అందరికీ ఆధార్ సేవలు అందుబాటులో ఉంచాలని సదుద్దేశంతో ప్రభుత్వం ఆధార్ కార్డు అప్‌డేట్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. అయితే ఈ కార్యక్రమం నత్తనడకన సాగుతోంది. గ్రామ సచివాలయాల్లో పలుచోట్ల ఆధార్ అప్‌డేట్ సెంటర్‌లను ఏర్పాటు చేసింది. ప్రతి ప్రభుత్వ పథకానికి ఆధార్‌కార్డు తప్పనిసరిగా లింకు చేయవలసి ఉంది. ఆధార్‌కార్డు అప్‌డేట్ కోసం నమోదు కేంద్రానికి వచ్చిన విద్యార్థులు, వృద్ధులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు తప్పనిసరిగా మారాయి. మండల పరిధిలోని కొల్లిపర, తూములూరు, అన్నవరం, దావులూరు, అత్తోట, అన్నవరం లంక, మున్నంగి, వల్లభాపురం గ్రామాల్లో ఆధార్ సెంటర్‌లను సచివాలయాల్లో ప్రత్యేకంగా ప్రారంభించారు. ప్రస్తుతం మున్నంగి, అత్తోట, కొల్లిపర, తూములూరు గ్రామాల్లో ఆధార్ నమోదును ప్రారంభించారు. ఇది 29వ తేదీవరకు కొనసాగనుంది. 29తర్వాత మిగతా గ్రామాల్లో ఆధార్ నమోదు కొనసాగనుంది. అయితే ఈ ఆధార్ నమోదు కొన్నిచోట్ల సర్వర్, ఇంటర్‌నెట్ వంటి సాంకేతిక సమస్యతలతో ఆధార్ అప్‌డేట్ కార్యక్రమం నత్తనడక సాగుతోంది. దీనికితోడు ఆధార్ కార్డు అప్‌డేట్ చేసే సచివాలయం సిబ్బంది కూడా సమయపాలన పాటించకపోవడంతో ఆధార్‌సేవలు కోసం వచ్చిన గ్రామీణ ప్రజలు నానా అగచాట్లు పడుతున్నారు. ప్రతి ఆధార్ నమోదు కేంద్రంలో ఒక ఆధార్ పరిశీలకుడు ఉండాల్సి ఉన్నప్పటికి వారు అందుబాటులో ఉండటం లేదు. ఆధార్ అప్‌డేట్ కోసం వచ్చిన వారు ఏమి ప్రూఫ్‌లు తీసుకెళ్ళాలో, తీసుకెళ్ళిన ప్రూఫ్‌లు ఉపయోగపడతాయో తెలియక ఆధార్ సెంటర్ల చుట్టూ ప్రదక్షణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గురు, శుక్ర వారాల్లో నాలుగు కేంద్రాల్లో మొత్తం 150 మందికి మాత్రమే ఆధార్ నమోదు జరిగింది. ఇలా అయితే ఎప్పటికి పూర్తయ్యేనో అని పలువురు వాపోతున్నారు. ఇదిలా ఉంటే మండల పరిధిలోని దావులూరు సచివాలయంలో ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని ప్రారంభించమని డిజిటల్ అసిస్టెంట్‌కు ఎంపీడీవో విజయలక్ష్మి ఆదేశాలు జారీచేశారు. గురువారం అతను ఆధార్ సెంటర్‌ను ప్రారంభించకుండా నిర్లక్ష్యంగా విధులకు హాజరుకాలేదు. ఆధార్ అప్‌డేట్ కోసం సచివాలయానికి వచ్చిన వారు ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులుపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీవో విజయలక్ష్మి సచివాలయానికి వెళ్ళి తనిఖీచేశారు. డిజిటల్ అసిస్టెంట్ విధులకు హాజరు కాకపోవటాన్ని గుర్తించారు. ఎంపీడీవో ఆ డిజిటల్ అసిస్టెంట్‌ను వివరణ కోరగా భారీ వర్షం కారణంగా విధులకు హాజరు కాలేదని సమాధానం ఇవ్వటంతో దీనిపై ఎంపీడీవో విజయలక్ష్మి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ముందస్తు సమాచారం లేకుండా బాధ్యతలు విస్మరించిన డిజిటల్ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తాం

● జేసీ అశుతోష్‌శ్రీవాస్తవ



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

కొల్లిపర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నట్లు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రం కొల్లిపర రైతు సేవా కేంద్రంలో ఆయన రైతులతో మండల స్థాయి అధికారులు, వ్యవసాయాధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. వ్యవసాయాధికారులను మండలంలో ఎన్ని వేల ఎకరాల్లో వరిసాగు అవుతుందని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా రైతులను ధాన్యం కొనుగోలు కేంద్రాల విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని అడగటంతో రైతులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. గత ఏడాది ధాన్యం కొనుగోలు కేంద్రాలను అలస్యంగా ప్రారంభించారని, ధాన్యాన్ని లోడు చేయటానికి గోతాలు కూడా ఇవ్వలేకపోయారని, ధాన్యాన్ని కొనుగోలు చేసిన రవాణా చేయటానికి ఎవరూ ముందుకు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం తేమ శాతాన్ని 17 నుంచి 22శాతం వరకు ఉండేలా చూడాలని, సబ్సిడీపై టార్పాలిన్ పట్టాలు ఇప్పించాలని జేసీకి విన్నవించారు. ఈ సందర్భంగా అశుతోష్‌శ్రీవాస్తవ మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయటానికి సిద్ధంగా ఉంటామన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఏవరైనా ఇబ్బందులకు గురిచేస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ధాన్యాన్ని ఏవరైనా లారీలు, ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తే నగదును రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. ధాన్యం రవాణా, గోతాలు విషయంలో ఈ ఏడాది ఏలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

సమావేశంలో సివిల్ సప్లయర్స్ జిల్లా మేనేజర్ తులసి, జీడీసీఎంఎస్ జిల్లా మేనేజర్ హరిగోపాల్, తహసీల్దార్ సిద్ధార్థ, మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనిచేసే ప్రభుత్వంపై బురద చల్లడం వైసీపీ నేతల పని

టీడీపీ నాయకుల ధ్వజం

తెనాలి అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం కోసం ప్రజల కోసం పనిచేస్తున్న ప్రభుత్వంపై బురద చల్లడమే వైసీపీ నేతలు పనిగా పెట్టుకున్నారని పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహ్మద్ ఖుద్దూస్ విమర్శించారు. నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ, అభివృద్ధిని చూసి మాజీ ముఖ్యమంత్రి కూడా ఓర్వలేక అదుపు కోల్పోయి మాట్లాడటం ప్రజలు గమనిస్తున్నారని, అసమర్థ పాలనకు తగిన బుద్ధి చెప్పినా వారిలో మార్పు రాలేదన్నారు. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ తెస్తే వైసీపీ నాయకులు దానిని విమర్శించారని, అనంతరం మాజీ ముఖ్యమంత్రి డేటా సెంటర్‌ను స్వాగతిస్తున్నామనటం రెండు నాలుకల ధోరణి కాదా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా మద్యంలో కుంభకోణానికి పాల్పడి విచారణ ఎదుర్కొంటున్న వైసీపీ నాయకులు దాని నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు నకిలీ మద్యం డ్రామా నడిపారని దుయ్యబట్టారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌తో పాటు ఆయన అనుచరులు ఐదేళ్లలో చేసిన అవినీతి, అక్రమాలు, చరిత్రలో ఎక్కడా జరగలేదని, పరిశ్రమలు తెస్తున్నామంటూ గత ఐదేళ్ల ప్రజలను మభ్యపెట్టి కాలం గడిపారని, కనీసం రాజధాని అభివృద్ధికి ఎక్కడా కూడా ఒక్క రాయి పెట్టింది లేదని విమర్శించారు. హైదరాబాద్ అభివృద్ధికి, హైటెక్‌సిటీ నాంది పలికిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుభవం, వయసు చూడకుండా సంస్కారం మరిచి మాట్లాడటం జగన్‌కే చెల్లించదన్నారు. అసెంబ్లీకి రావడానికి భయం ఎందుకని, సమస్యలు ఉంటే వచ్చి ప్రస్తావించవచ్చుకదా అని హితవు పలికారు. ఉద్యోగుల జీతాలను తగ్గించడమే కాకుండా వారిపై పోలీసులను ప్రయోగించి ఉద్యమాలను అణచి వేసేందుకు ప్రయత్నించిన మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ నాయకులు, ఉద్యోగులపై ప్రేమ ఉన్నట్లుగా మాట్లాడటం వారి పాలనలో ఎన్నో బాధలుపడ్డ ఉద్యోగులు మరిచిపోరని చెప్పారు. పార్టీ నాయకులు జొన్నాదుల మహేష్, అశోకవర్ధన, అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, విజయ్, దుర్గా, రాము, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఏపీ జ్యుడీషియల్ అకాడమీని సందర్శించిన కలెక్టర్



ఏపీ జ్యుడీషియల్ అకాడమి డైరెక్టర్‌తో సమావేశమైన కలెక్టర్ అన్సారియా

గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ చింతలపూడి పురుషోత్తం కుమార్‌ను కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్‌జిందాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరి మండలం కాజ వద్ద ఉన్న ఏపీ జ్యుడీషియల్ అకాడమీని శుక్రవారం కలెక్టర్, ఎస్పీ తొలిసారిగా సందర్శించారు. ఈ సందర్భంగా డైరెక్టర్‌ని కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ కార్యక్రమంలో తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహా, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ఎస్‌కే ఖాజావలి, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా పాల్గొన్నారు.

లాడ్జిలో తెలంగాణ వ్యక్తి ఆత్మహత్యాయత్నం

తెనాలి క్రైం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): త్రీటౌన్ స్టేషన్ పరిధిలోని పోలీసులు శుక్రవారం తనిఖీలు చేస్తున్న సమయంలో దివ్య లాడ్జిలో ఓ వ్యక్తి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటం గుర్తించిన సిఐ సాంబశివరావు వెంటనే అతని రూమ్ తనిఖీ చేయగా అక్కడ పురుగుమందు గుళికలు లభించాయి. అప్పటికే అతడు కొంతమేర పురుగుల మందు తీసుకున్నట్లు గుర్తించి వెంటనే అతనిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సేకరించిన వివరాల మేరకు బాధితుడు గవలపల్లి మహేశ్వరరావు (52) నిజాంపేట, కేపీహెచ్‌బీ కాలనీ, తెలంగాణా అని చిరునామాతో లాడ్జి గది తీసుకున్నాడు. ఆర్థిక బాధలతో ఆత్మహత్యయత్నం చేసినట్లు పోలీసులు గుర్తించారు. సకాలంలో వ్యక్తి ప్రాణాలు కాపాడిన సీఐ సాంబశివరావు, ఎస్ఐ కరిముల్లాను డీఎస్పీ జనార్ధనరావు అభినందించారు.

భూ సమస్యలపై అర్జీలు అందజేయండి

● తహసీల్దార్ జియావుల్‌హక్



మాట్లాడుతున్న తహసీల్దార్ జియావుల్ హక్

పొన్నూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో నిర్వహించనున్న గ్రామ సభల్లో సమస్యలపై అర్జీలు అందజేయాలని తహసీల్దార్ జియావుల్‌హక్ సూచించారు. గ్రామ సభలపై తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీన ఆరెమండ 26న ఉప్పరపాలెం 27న దొప్పలపూడి గ్రామాల్లో రీ సర్వేపై గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ గ్రామాల్లో ఇప్పటికే రైతులకు 9(2) నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. అయితే గ్రామ సభల ద్వారా రైతుల వద్ద నుంచి అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందని వారి సందేహాలను నివృత్తి చేయనున్నట్లు చెప్పారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతులు ఈ గ్రామ సభలను సద్వినియోగం చేసుకొని తమ భూ సమస్యలకు పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఆలేటి మాధవి, సర్వేయర్ శ్రీనివాస రాజు, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో ప్రధాన రహదారులు ఛిద్రం



చింతలపూడి వద్ద గుంతలు పూడుస్తున్న అధికారులు

పొన్నూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న ఎడతెగని భారీవర్షాలకు పొన్నూరు పట్టణ, మండలంలోని పలు ప్రధానరహదారులు ఛిద్రం అయ్యాయి. గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక రహదారులపైనే భారీగా నిలిచి ఉంటోంది. దీంతో రహదారులు గుంతల మయంగా మారాయి. జీబీసీ ప్రధాన రహదారి చింతలపూడి వద్ద భారీ గుంతలు ఏర్పడి గుంతల్లోనే వాన నీరు రోజుల తరబడి నిల్వ ఉండటంతో గత రెండు రోజుల వ్యవధిలో పదుల సంఖ్యలో ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడి గాయపడ్డారు. దీంతో రోడ్లు భవనాలు శాఖ అధికారులు శుక్రవారం తాత్కాలికంగా గుంతలు పూడ్చే పనులు చేపట్టారు. అలాగే మండల పరిధిలోని కసుక్రరు గ్రామం వద్ద, పొన్నూరు నుంచి చందోలు వెళ్లే రహదారి పూర్తిగా ధ్వంసమైంది. అధికారులు తక్షణమే స్పందించి రహదారుల మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వడ్లమూడి అడ్డరోడ్డులో గుంత పూడ్చివేత

చేబ్రోలు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా రవాణాకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న వడ్లమూడి అడ్డరోడ్డులోని శలపాడుకు వెళ్లే దారిలో ఉన్న లోతైన గుంతను అధికారులు శుక్రవారం డస్టుతో తాత్కాలికంగా పూడ్చారు. 'గుంతలమయంగా అడ్డరోడ్డు కూడలి' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. దీంతో కొంత మేర అక్కడ నీరు నిలువకుండా, వాహనాలు గొయ్యిలో దిగకుండా ఊరట కలిగింది. ఈ సందర్భంగా సమస్యను వెలుగులోకి తెచ్చిన ఆంధ్రజ్యోతికి స్థానికులు కృతజ్ఞులు తెలిపారు. తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా రోడ్డును పునరుద్దరించాలని వారు ఈ సందర్భంగా కోరారు. వర్షాకాలంలో మళ్లీ రోడ్డు దెబ్బతినే అవకాశం ఉన్నందున శాశ్వత పరిష్కారం కోసం ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



గుంతను డస్టుతో తాత్కాలికంగా పూడ్చిన అధికారులు

లాడ్జి నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

● సీఐ సాంబశివరావు

తెనాలి క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): లాడ్జి నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని త్రీ టౌన్ సీఐ సాంబశివరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక త్రీ టౌన్ స్టేషన్ పరిధిలోని 15 లాడ్జిలను పోలీసు సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లాడ్జి నిర్వాహకులతో సీఐ మాట్లాడుతూ, లాడ్జిలకు వచ్చే వారి పూర్తి వివరాలు, ఆధారాలు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం లాడ్జిలలోని పలు రూములను పరిశీలించారు. లాడ్జిల్లో అనుమానితులుగా ఉన్న వ్యక్తుల సమాచారాన్ని తప్పనిసరిగా పోలీసులకు ఇవ్వాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, నిబంధనలకు వ్యతిరేకంగా లాడ్జి గదులను అద్దెకు ఇస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.



లాడ్జి నిర్వాహకులను ప్రశ్నిస్తున్న సీఐ సాంబశివరావు

వాహన తనిఖీలు

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని త్రీ టౌన్ సీఐ సాంబశివరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మారీసుపేట ప్రాంతంలో ఎస్ఐ కరిముల్లా, సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించని వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

నకిలీ మద్యం అరికట్టేందుకు సురక్ష యాప్

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్



ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నకిలీ మద్యం అరికట్టేందుకు ప్రభుత్వం సురక్ష యాప్ తీసుకువచ్చినట్లు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలిపారు. ఎక్సైజ్ శాఖ రూపొందించిన సురక్ష యాప్ పోస్టర్లు శుక్రవారం ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో నకిలీ మద్యం రాష్ట్రంలో ఏరులై పారిందన్నారు. నకిలీ మద్యం ధాటికి ప్రజలు ప్రాణాలు కోల్పోగా ఎక్కువమంది అనారోగ్యం బారిన పడ్డారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నకిలీ మద్యాన్ని అరికట్టేందుకు సురక్ష యాప్ తీసుకువచ్చినట్లు చెప్పారు. మద్యం కొనుగోలు దారులు దుకాణం వద్దే తమ ఫోన్‌లో ఈ యాప్‌ను ఉపయోగించి మద్యం నకిలీనా, కాదా అని తెలుసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

డస్ట్‌బిన్లు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్, కౌన్సిలర్



హోం కంపోస్టుతో వ్యర్థాలు తగ్గించాలి

● మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రతి ఇంటిలో హోం కంపోస్టు చేసి వ్యర్థాల ఉత్పత్తి తగ్గించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కోరారు. 22, 25 వార్డులలో శుక్రవారం పలు అపార్టుమెంట్‌లలో హోంకంపోస్టు తయారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో నానాటికి వ్యర్థాల ఉత్పత్తి పెరిగిపోతుందని, ఇంటి వద్దే నియంత్రణ కోసం హోంకంపోస్టు విధానాన్ని మున్సిపాలిటీ చేపట్టిందన్నారు. తడి వ్యర్థాలను ఒక బిన్‌లోవేసి కోకోపిట్ కలుపుతూ ఉంటే 20రోజుల్లో కంపోస్టు ఎరువు తయారవుతుందన్నారు. దీనిని అపార్ట్‌మెంట్‌లో పెంచుకునే మొక్కలకు వినియోగించుకోవచ్చన్నారు. కమిషనర్ అప్పలనాయుడు, కౌన్సిలర్లు తాడిబోయిన రామయ్య, మహబూబ్ బాషా, హెల్త్ ఆఫీసర్ యేసుబాబు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

పోలియో నిర్మూలనకు రోటరీ క్లబ్ కృషి

● క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకటపూర్ణచంద్

తెనాలి అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలియో నిర్మూలనకు ప్రభుత్వంతో పాటు రోటరీ క్లబ్, స్వచ్ఛంద సంస్థలు ఎంతగానో కృషి చేశాయని క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకటపూర్ణచంద్ చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో శుక్రవారం మారీసుపేటలోని ఎన్‌సీఆర్ఎన్ఎం హైస్కూల్‌లో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు, హెచ్ఎం కరిముల్లా, కార్యదర్శి జీవీ నారాయణ, గుత్తా వెంకటరత్నం, రాజేంద్రప్రసాద్, రఫీ పాల్గొన్నారు. రూరల్ మండలంలోని పెదరావూరు హైస్కూల్‌లో క్లబ్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

పోలియో వ్యాక్సిన్‌కు 75 ఏళ్లు: డాక్టర్ ప్రియాంక

పోలియో వ్యాక్సిన్ కనిపెట్టి 75 ఏళ్లు అయ్యిందని నందులపేట ఆరోగ్య కేంద్రం వైద్యురాలు వి.ప్రియాంక చెప్పారు. ఆసుపత్రిలో శుక్రవారం ప్రపంచ పోలియో దినోత్సవం నిర్వహించారు. చిన్నపిల్లల్లో మైలైటిస్ అనే వైరస్ కారణంగా పోలియో వస్తుందని, ప్రభుత్వం ఉచితంగా ఈ వ్యాక్సిన్ పంపిణీ చేస్తుందన్నారు. పిల్లలు పుట్టిన 6, 10, 14, 16, 18 నెలల వయసులో వ్యాక్సిన్ వేస్తామని, 2014 మార్చి 27 నాటికి భారతదేశం పోలియో రహితదేశంగా గుర్తింపు పొందిందన్నారు. అన్ని ఆరోగ్యకేంద్రాల్లో వ్యాక్సిన్ అందుబాటులో ఉంటుందన్నారు. ఉమాకాంత్, బాలచంద్రమౌళి, శిరీష పాల్గొన్నారు.

ఆధార్ నవీకరణ కేంద్రాలను ఉపయోగించుకోవాలి

గుంటూరు(విద్య), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 30వ తేదీ వరకు ఉచిత ఆధార్ నవీకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్టేట్ నోడల్ ఆఫీసర్ చెరుకూరి రమేష్ తెలిపారు. పెదకాకాని మండలం వెనిగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆధార్ నవీకరణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. జిల్లాలోని ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు తమతమ పరిధిలోని విద్యార్థులకు ఆధార్ అప్‌డేషన్ పూర్తి చేయించాలని సూచించారు.

వీఆర్వోలు, సర్వేయర్లు అందుబాటులో ఉండాలి

● తహసీల్దార్ సిద్ధార్థ

కొల్లిపర, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు ప్రజలకు అందుబాటులో ఉండి వారినుంచి వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, విలేజ్ సర్వేలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ గ్రీవెన్స్ ద్వారా వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించాలన్నారు. మండలంలోని గ్రామాల ప్రజల నుంచి ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. అదేవిధంగా కొత్త రేషన్ కార్డుల కోసం పెట్టుకున్న ప్రతి దరఖాస్తును పరిశీలించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, మండల సర్వేయర్ హరికృష్ణ, ఆర్ఐ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సిద్ధార్థ

పోలియో నివారణపై అవగాహనా ర్యాలీ

పెదనందిపాడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పోలియో నిర్మూలనకు రోటరీ విశేష కృషి చేస్తుందని రోటరీ డిస్ట్రిక్ట్ చైర్మన్ పోపూరి లక్ష్మీనారాయణ అన్నారు. ప్రపంచ పోలియో నివారణ దినోత్సవంలో భాగంగా శుక్రవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్తూ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. 2014సంవత్సరంలో భారతదేశాన్ని పోలియోరహిత దేశంగా ప్రకటించారని దీని నివారణకు రోటరీ క్లబ్ కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పోలియో నిర్మూలనకు కృషి చేసిందన్నారు. ప్రపంచంలో కూడా పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, కజకిస్థాన్ వంటి దేశాల్లో నివారణ చేపట్టిగలిగితే పోలియో రహిత ప్రపంచంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి పోపూరి నాగేశ్వరరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ


రేపూడి మార్కెట్‌లోని ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న ఆర్డీవో కే శ్రీనివాసరావు

ఫిరంగిపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేపూడి వ్యవసాయ మార్కెట్ యార్డు నందు భద్రపరిచిన ఈవీఎంలు, వీవీప్యాట్ గోడౌన్‌ను గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కే శ్రీనివాసరావు శుక్రవారం తనిఖీ చేశారు. భద్రతా ప్రమాణాల్లో ఎలాంటి జాప్యం తీసుకోవద్దని అధికారులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జే ప్రసాదరావు, ఆర్అండ్‌బీ ఏఈ అరుణకుమారి, అగ్నిమాపకశాఖ అధికారి అనీల్‌సింగ్, శివకుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఈమనిలో రైస్ మిల్లులను తనిఖీ చేసిన జేసీ

దుగ్గిరాల(ఈమని), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈమనిలోని శ్రీవిఘ్నేశ్వర రైస్‌మిల్‌ను జేసీ శ్రీవాత్సవ శుక్రవారం పరిశీలించారు ఖరీఫ్ పూర్తయ్యాక రైతుల నుంచి ప్రభుత్వం, ఆర్ఎస్‌కేల ద్వారా కొనుగోలు చేసే ధాన్యాన్ని భద్రపరిచే మిల్లుల్లో తనిఖీలు చేశారు. ఈమని వచ్చిన జేసీ మిల్లులో ఏర్పాట్లు, రైతులకు అవసరమైన మేర, గోనె సంచులు (గన్నీ బ్యాగ్స్) అందించడం వంటి పలు అంశాలను మిల్లుయజమానులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట పౌరసరఫరాల అధికారులు, తహసీల్దార్ ఐ.సునీత తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అప్రమత్తత

తాడేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వాతావరణ పరిస్థితులు దృష్టిలో ఉంచుకుని భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో మంచినీరు కలుషితమై డయేరియా, టైఫాయిడ్, కామెర్లు వంటి వ్యాధులు వ్యాపించడానికి అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రకాష్‌నగర్ అర్బన్ హెల్త్‌సెంటర్ హెల్త్ అసిస్టెంట్ జయరాజు కోరారు. శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా డోలాస్ నగర్ బాప్టిస్టు చర్చిలోని ప్రజలకు మలేరియా, డెంగీ, తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక సచివాలయం హెల్త్ సెక్రటరీ శశి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఎంఏవై 2.0ను సద్వినియోగించుకోవాలి

దుగ్గిరాల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సొంతస్థలం కలిగి గృహాలు నిర్మించుకోదలచిన వారు ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ 2.0 కింద ఇళ్లు నిర్మించుకోవచ్చునని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. ప్రభుత్వ పట్టా, పొజిషన్ సర్టిఫికెట్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు, భార్యాభర్తలు జంటగా దిగిన ఫొటో, ఉపాధిహామీ పథకం కార్డు తదితర పత్రాలను తీసుకుని సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్‌ను కలిసి ఏడబ్ల్యూఏఎస్ఎస్ యాప్ నందు ఈ నెల 5వ తేదీలోగా, రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చునని తెలిపారు. కనీసం రూ.లక్షా20వేల విలువ కలిగి 275 విస్తీర్ణంగల స్థలం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.

సమ్మె నోటీసు అందజేత

తాడేపల్లి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ మున్సిపల్ కార్పొరేషన్ నగర పంచాయతీలలో రెండు సంవత్సరాలుగా పేరుకుపోయి ఉన్న వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో అక్టోబర్ 29, 30 తేదీల్లో రాష్ట్ర సీడీఎంఏ కార్యాలయం ఎదుట శాంతియుత దీక్షలు నిర్వహిస్తున్నట్టు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గండికోట దుర్గారావు చెప్పారు. సమ్మెకు సంబంధించిన నోటీసును శుక్రవారం స్థానిక ఏఐటీయూసీ నేత తుడిమెల్ల వెంకటయ్యతో కలిసి తాడేపల్లి ఎస్ఐ ప్రతాప్‌కుమార్‌కు అందజేశారు. దుర్గారావు మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు నవంబర్ 3వ తేదీలోపు పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్తంగా దఫ దఫాల ఆందోళనకు పిలుపునిచ్చారన్నారు.

ఆధార్ సెంటర్‌ను వినియోగించుకోవాలి : ఎంఈవో

కాకుమాను, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆధార్ సెంటర్‌ను విద్యార్థులు వినియోగించుకోవాలని మండల విద్యాశాఖాధికారి కేఎఫ్ కెన్నడీ అన్నారు. చిన్నలింగాయపాలెం, కాకుమాను జడ్పీ పాఠశాలలో జరుగుతున్న ఆధార్ సెంటర్‌ను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో కెన్నడీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆధార్ అనుసంధానం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కాకుమాను హెచ్‌ఎం భాస్కర్, సీఆర్పీ చలపతిరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల పరిధిలోని కొమ్మూరు ఎంపీపీ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు, విద్యార్థుల హాజరు శాతం పరిశీలించారు.

పత్తి రైతుల రిజిస్ట్రేషన్ ప్రారంభించాలి

రైతుల సందేహాలు నివృత్తి చేయాలి
కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాలు


పత్తి, ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ అన్సారియా

గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియని సత్వరమే ప్రారంభించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. పత్తి, ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సేవాకేంద్రం (ఆర్ఎస్‌కే) వారీగా రైతులతో సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు తెలియజేయాలన్నారు. ప్రాంతాల వారీగా పత్తి ఉత్పాదకత వివరాలు సమర్పించాలని ఆదేశించారు. పత్తి సేకరణలో తరచూ తలెత్తే సందేహాలను స్పష్టంగా నివృత్తి చేయాలన్నారు. కలెక్టరేట్‌లో ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

నేటి నుంచే రైతుల రిజిస్ట్రేషన్

వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకుడు సత్యనారాయణ చౌదరీ మాట్లాడుతూ రైతుల రిజిస్ట్రేషన్ ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభిస్తామని చెప్పారు. జిల్లాలో 94,290 మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి రాగలదని అంచనా వేస్తున్నామని చెప్పారు. తాడికొండ, మేడికొండూరు, ఫిరంగిపురం, ప్రత్తిపాడు ప్రాంతాల్లో ఎక్కువగా దిగుబడి వస్తుందని తెలిపారు. పత్తి రైతుల సంఘం ప్రతినిధి హరనాథబాబు మాట్లాడుతూ ప్రాంతాల వారీగా మ్యాపింగ్ అయిన మిల్లులు యాప్‌లో కనిపించడం వల్ల ప్రయోజనం కలుగుతుందన్నారు.

కపాస్ కిసాన్ యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలి

ప్రత్తి రైతులు కపాస్ కిసాన్ యాప్‌ను వారి మొబైల్ ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకోవాలని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) జనరల్ మేనేజర్ రాజేంద్రషా కోరారు. 2025-26 పంట సంవత్సరంలో సీసీఐకి మద్దతు ధర (ఎంఎస్‌పీ)తో పత్తి విక్రయాలకు 'కపాస్ కిసాన్' మొబైల్ యాప్‌లో నమోదు కావాలన్నారు. మద్దతు ధరకు విక్రయానికి యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని ఆయన సూచించారు.

అనంతరం ధాన్యం సేకరణపై కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ ధాన్యం సేకరణలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పౌర సరఫరా సంస్థ జిల్లా మేనేజర్ కే తులసి ధాన్యం సేకరణ ప్రక్రియ వివరాలు తెలిపారు. ఈ సమావేశంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, వ్యవసాయ శాఖ జేడీ అయితా నాగేశ్వరరావు, వ్యవసాయ మార్కెట్ యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక, జిల్లా పౌర సరఫరాల అధికారి విజయలక్ష్మి, రవాణా అధికారి శ్రీహరి పాల్గొన్నారు.


సురక్ష యాప్‌ను ఆవిష్కరిస్తున్న బూర్ల రామాంజనేయులు, ఎక్సైజ్ అధికారులు

కల్తీ మద్యాన్ని అరికట్టేందుకే 'సురక్ష యాప్'

• ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం సురక్ష యాప్‌ను ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. స్థానిక జేకేసీ రోడ్డులో వైన్ మార్టు వద్ద సురక్ష యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీసాపై క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి మద్యం నాణ్యతను తనిఖీ చేసుకోవాలని సూచించారు. వైసీపీ నాయకులు మద్యం విధానంపై చౌకబారు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. దీనిపై వైసీపీ నాయకులు మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

• విద్యానగర్, క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని రహదారులపై ఆర్అండ్‌బీ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. మంజూరైన రూ. 54 కోట్లతో, ఐదు మండలాల్లో కేటాయించిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామల్లోని డొంక రోడ్లు, ఇతర రహదారుల మరమ్మతులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలన్నారు.

కేఎల్‌యూను సందర్శించిన బెర్లిన్ విద్యార్థులు


విదేశీ యూనివర్సిటీ ప్రతినిధులను సన్మానిస్తున్న వీసీ సారథివర్మ తదితరులు

తాడేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కేఎల్ డీమ్డ్ యూనివర్సిటిని శుక్రవారం జర్మనీలోని బెర్లిన్‌కు చెందిన వివిధ యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు సందర్శించారు. అంతర్జాతీయ సంబంధాల డీన్ ఎం కిషోర్‌బాబు వారికి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు వైస్ చాన్స్‌లర్ జి.పార్థసారధివర్మతో సమావేశమయ్యారు. వర్సిటీలో జరుగుతున్న వివిధ రకాల పరిశోధనల గురించి అడిగి తెలుసుకున్నారు. విదేశాలకు చెందిన యూనివర్సిటీలతో కలిసి కేఎల్ వర్సిటీ పరిశోధకులు చేస్తున్న పలు రకాల పరిశోధనల గురించి సారథివర్మ వారికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన తమ వర్సిటీలో జరుగుతున్న పరిశోధనలలో ప్రపంచ స్థాయిలో కేఎల్‌యూ ఆచార్యులు సాధించిన ప్రగతిని వివరించారు. అనంతరం వారు సాక్‌లో ఉన్న వివిధ రకాల క్లబ్‌లను సందర్శించారు. సాంస్కృతిక క్లబ్ వారితో కలిసి వారు కూడా నృత్యం చేస్తూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనంతరం వీసీ సారధివర్మ హోమ్ బోల్ట్ యూనివర్సిటి ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. అంతర్జాతీయ సంబంధాల డీన్ ఎం కిషోర్‌బాబు వారికి విదేశీ యూనివర్సిటిలతో తమ వర్సిటి చేసుకున్న అవగాహన ఒప్పందాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రోవీసీలు వెంకట్రామ్, రాజశేఖరరావు, ప్రసాద్, రిజిస్ట్రార్ సుబ్బారావు, అంతర్జాతీయ సంబంధాల డీన్ కిషోర్ బాబు, డైరెక్టర్ మారుతి విజయ్, సాక్ డైరెక్టర్ సాయి విజయ్, విదేశీ భాషల విభాగాధిపతి జమిందార్, వ్యవసాయ కళాశాల విభాగాధిపతి బాలకృష్ణ, అంతర్జాతీయ సంబంధాల కోఆర్డినేటర్ ప్రసాద్ పాల్గొన్నారు.

సీఆర్డీఏ కార్యాలయంలో గ్రీవెన్స్ డే


గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరిస్తున్న నోడల్ అధికారి జయశ్రీ

తుళ్లూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం తుళ్లూరులోని సీఆర్డీఏ కార్యాలయంలో గ్రీవెన్స్ డే శుక్రవారం నిర్వహించారు. పలువురు రాజధాని ప్రాంతవాసులు, రైతు కూలీలు తమ అర్జీలను గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మేనేజ్‌మెంట్ (జీఆర్ఎం) నోడల్ అధికారి పి.జయశ్రీకి అందజేశారు. అర్జీలను సాధ్యమైనంత వేగంగా పరిష్కరిస్తామని నోడల్ అధికారి తెలియజేశారు. సీఆర్డీఏలోని వివిధ విభాగాల అధికారులు గ్రీవెన్స్ డేకు హాజరై రైతులు తెలియజేసిన ఫిర్యాదుల్లో పలు సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం చూపారు. ప్రతి శుక్రవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. గ్రీవెన్స్ డేలో 16 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కేఎస్ భాగ్యరేఖ, జీ భీమారావు, జీ రవీందర్, ఎం శేషిరెడ్డి, సామాజిక సంక్షేమ విభాగ డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు, ఎస్టేట్స్ విభాగ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే(ఎల్‌పి) ఎస్ రవీంద్రప్రసాద్, డెవలప్‌మెంట్ ప్రమోషన్ విభాగ జోనల్ జాయింట్ డైరెక్టర్ సీహెచ్. మధుసూదనరావు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏపీ జ్యుడీషియల్ అకాడమీని సందర్శించిన కలెక్టర్


ఏపీ జ్యుడీషియల్ అకాడమి డైరెక్టర్‌ని కలిసిన కలెక్టర్ అన్సారియా

గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్ర జ్యోతి): ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ చింతలపూడి పురుషోత్తం కుమార్‌ను కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్ మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళగిరి మండలం కాజా వద్ద ఉన్న ఏపీ జ్యుడీషియల్ అకాడమీని శుక్రవారం కలెక్టర్, ఎస్పీ తొలిసారిగా సందర్శించారు. ఈ సందర్భంగా డైరెక్టర్‌ని కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ కార్యక్రమంలో తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహా, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా పాల్గొన్నారు.

మలినేనిలో ముగిసిన ఇంటెన్సివ్ 36 హ్యాకథాన్

• పది జట్లను విజేతలుగా ప్రకటించిన జ్యూరీ సభ్యులు


విద్యార్థులు నిర్వహిస్తున్న ప్రాజెక్టులను పరిశీలిస్తూ విద్యార్థులతో మాట్లాడుతున్న చైర్మన్ మలినేని పెరుమాళ్ళు

వట్టిచెరుకూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లడిగుంట గ్రామ సమీపంలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్సీ మూడో సంవత్సరం విద్యార్థినులకు మేక్ స్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐవోటీ విత్ జెన్ అండ్ ఆజెట్స్ ఏ-1పై 36 గంటల హ్యాకథాన్ శుక్రవారం ముగిసింది. ఈ ఇంటెన్సివ్ హాకథాన్‌లో 255 మంది విద్యార్థులు పాల్గొని ఏ-1 రంగంలో సృజనాత్మక సమస్యలను పరిష్కరించేందుకు చేసిన కృషి అభినందనీయమని వక్తలు వెల్లడించారు. 36 గంటల పాటు టెక్నికల్ సవాళ్ళు కోడింగ్ మోడల్, డెవలప్‌మెంట్, ప్రాజెక్టు ప్రెజెంటేషన్ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్ళు మాట్లాడుతూ నేటి టెక్నాలజీ యుగంలో ఐవోటీ జెనిటిక్ ఏ-1 జెనిటివ్ ఏ-1 వంటి సంకేతిక పరిజ్ఞానాలు భవిష్యత్తును మలుపు తిప్పుతాయన్నారు. విద్యార్థులు ప్రాజెక్టులను కేవలం ల్యాబ్‌ల వరకు పరిమితం చేయకుండా వాటిని రియల్ టైమ్ ఎన్విరాన్‌మెంట్‌లో అమలు చేయగలిగేలా నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ జే అప్పారావు, సీఎస్ఈ హెచ్‌వోడీ జీ రామస్వామి, ఇతర విభాధిపతులు మేక్ స్కిల్ సీఈవో మధు పర్వతనేని, మేక్ స్కిల్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు పాల్గొనగా జ్యూరీ సభ్యులుగా ఆంధ్రా స్టార్టప్ సీనియర్ కన్సలెంట్ నంద కిషోర్‌రావు, హోప్ బైన్ సీఈవో భస్నీనాయుడు, నిహా టెక్ సీఈవో పవన్‌కుమార్ ప్రాజెక్టులను పరిశీలించి పది జట్లను విజేతలుగా ప్రకటించారు.

షిర్డిసాయి టెంపుల్ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం


షిర్డిసాయి టెంపుల్ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం అందజేస్తున్న మన్నవ అబ్బయ్య చౌదరి

తాడికొండ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మోతడకలోని షిర్డిసాయి టెంపుల్ ట్రస్ట్ ద్వారా రూ. కోటిలు విరాళాలు సేకరించి దేవాలయాన్ని అభివృద్ధి చేయాలని సంకల్పంతో ముందుకు వెళ్తున్నామని ట్రస్ట్ చైర్మన్, సంగం డెయిరీ డైరెక్టర్ కంచర్ల శివ రామయ్య పేర్కొన్నారు. మోతకడ గ్రామానికి చెందిన వ్యాపారవేత్త మన్నవ అబ్బయ్య చౌదరి దేవాలయం అభివృద్ధికి లక్ష రూపాయల విరాళం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. షిర్డి సాయి టెంపుల్ పక్కనే ఉన్న శ్రీగంగా పార్వతి సమేత ముక్తేశ్వరస్వామి దేవస్థానాన్ని కూడా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో భక్తుల నుంచి విరాళాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. దేవాలయాల అభివృద్ధికి విరాళాలు ఇవ్వదలచిన భక్తులు సంప్రదించాలని ట్రస్ట్ చైర్మన్ పేర్కొన్నారు.

మహిళా రిజర్వేషన్ చట్టాన్ని సవరించాలి

• బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు


సమావేశంలో మాట్లాడుతున్న కేసన శంకరరావు

మంగళగిరి సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బీసీ మహిళలకు సబ్ కోటాను అమలు చేస్తూ చట్టసభల్లో 33 శాతంగా నిర్ణయించిన మహిళా రిజర్వేషన్ల చట్టానికి సవరణ చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. మంగళగిరిలోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 33 శాతంతో మహిళా రిజర్వేషన్ల బిల్లును కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆమోదించడం హర్షణీయమన్నారు. అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందిన ఓసీ మహిళలతో బీసీ మహిళలు పోటీపడి చట్ట సభల్లో అడుగుపెట్టడం అసాధ్యమని, అందుకే తప్పనిసరిగా 33శాతం మహిళా రిజర్వేషన్లతో కేంద్రం ఆమోదించిన మహిళా చట్టంలో బీసీ మహిళలకు సబ్ కోటాను ఇచ్చిన తర్వాత మాత్రమే అమలు జరపాలని డిమాండ్ చేశారు. అందుకోసం ఈ నెల 29న తిరుపతిలో మహిళలు ఒక్కరోజు నిరాహార దీక్ష చేప డుతున్నారని తెలిపారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, పారేపల్లి మహేష్, జయలక్ష్మి, నేతలు కోలా అశోక్, శివరామ్ బాబాజీ, చిప్పాడ చందు, తదితరులు పాల్గొన్నారు.

రేపు మార్కండేయ విద్యా సొసైటీ వార్షికోత్సవం

మంగళగిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మార్కండేయ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ 42వ వార్షికోత్సవం ఈ నెల 26వ తేదీన ఉదయం పది గంటలకు మంగళగిరి తెనాలి రోడ్డులోని శ్రీ మార్కండేయ కల్యాణ మండపంలో జరుగుతుందని సొసైటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు శుక్రవారం తెలిపారు. చేనేత కుటుంబాలకు చెందిన పేద విద్యార్థులు 617మందికి రూ.18.94 లక్షల విలువ చేసే ఉపకార వేతనాలు, రూ.3.21 లక్షల విలువ చేసే కాలిక్యులేటర్లు, నోటు పుస్తకాలు, బ్యాగులు అందజేయనున్నామని చెప్పారు. ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంటర్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్, బీటెక్, బీఫార్మసీ, ఎంబీబీఎస్, బీడీఎస్, ఫార్మాడీ చదువుతున్న విద్యార్థులకు మొత్తం రూ.22.16 లక్షల విలువ చేసే నగదు ప్రోత్సాహకాలను అందజేయనున్నామని పేర్కొన్నారు.

వైసీపీ జిల్లా కార్యదర్శిగా సుభాని

దుగ్గిరాల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా వైసీపీ కార్యదర్శిగా దుగ్గిరాలకు చెందిన షేక్ సుభాని నియమితులయ్యారు. గతంలో వైసీపీ జిల్లా మైనార్టీసెల్ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సుభాని తనకు జిల్లాస్థాయి పదవి లభించటంపై నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

26న చిలువూరులో మెగా వైద్యశిబిరం

దుగ్గిరాల(చిలువూరు), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): చిలువూరులో ఉచిత మెగా వైద్యశిబిరం ఆదివారం నిర్వహించనున్నారు. గతంలో పలుసేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించిన రంగిశెట్టి ఫౌండేషన్ సౌజన్యంతో పలువురు ప్రముఖ వైద్యులతో వైద్యపరీక్షా శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మానవసేవాసంస్థ వ్యవస్థాపకుడు వంగర సురేష్‌కుమార్ తెలిపారు.

వెలుగులో గ్రామ సమైఖ్య మాయ

• రిజిస్ట్రేషన్ లేకుండానే ఆన్‌లైన్‌లో గ్రామైఖ్య సంఘం
• గొట్టిపాడు డ్వాక్రా సంఘాల వార్‌లో వెల్లడైన నిజాలు
• ఫిర్యాదులతో వెలుగులోకి వస్తున్న వాస్తవాలు

ప్రత్తిపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామైఖ్య సంఘం రిజిస్ట్రేషన్ చేయకుండానే ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు సంఘ కార్యకలాపాలను యథేచ్ఛగా నిర్వహిస్తున్న విషయాలు డ్వాక్రా మహిళల ఫిర్యాదుతో వెలుగులోకి వస్తున్నాయి. కొంత కాలంగా గొట్టిపాడు డ్వాక్రా సంఘాలకు జరుగుతున్న వార్‌లో నివ్వెరపోయే నిజాలు బయట పడుతున్నాయి. ఆరు సంవత్సరాలుగా రిజిస్టర్ కాని గ్రామైఖ్య సంఘం యథేచ్ఛగా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ సంఘానికి సంబంధించి అనేక ఫిర్యాదులు డీఆర్‌డీఏ అధికారులతో పాటు కలెక్టర్‌కు వెళ్లిన నేపథ్యంలో ఉన్నతాధికారుల విచారణలో నమ్మలేని నిజాలు వెలుగు చూస్తున్నాయి.

30 గ్రూపులతో రాధాకృష్ణ సంఘం

2019లో వైసీపీ హయాంలో అప్పటి పెద్దల ప్రమేయమో.. మరేమో కాని శ్రీఆంజనేయ గ్రామైఖ్య సంఘాన్ని విడదీసి 30 గ్రూపులతో రాధాకృష్ణ గ్రామైఖ్య సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఒక గ్రామైఖ్య సంఘాన్ని ఏర్పాటు చేసిన తరువాత 1995 సహకార చట్టం ప్రకారం తప్పకుండా రిజిస్టర్ చేయించాలి. ఆ తరువాత సంఘ రిజిస్ట్రేషన్ కోడ్‌తో ఆన్‌లైన్‌లో నమోదు చేసి కార్యకలాపాలు కొనసాగించాలి. ప్రతి ఏడాది సంఘం రిజిస్ట్రేషన్‌ను రెన్యువల్ చేయించాల్సి ఉంటుంది. దీని ప్రకారమే వెలుగుకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఎంటర్ చేయాలి. కానీ ఇంతవరకు ఈ ప్రక్రియ లేకుండా సంఘ కార్యకలాపాలతో పాటు సంఘం నుంచి మండల సమాఖ్యకు నిధులు కూడా ప్రతి ఏడాది పంపుతున్నారు. అంతే కాకుండా రిజిస్టర్ కాని ఈ గ్రామైఖ్య సంఘం నుంచి జీతాలు కూడా మంజూరు చేస్తున్నారు. నాటి వైసీపీ ప్రభుత్వంలో వెలుగు అధికారులు అడ్డగోలుగా చేసిన పనులు ఇప్పుడు ఆ సంఘంలోని డ్వాక్రా మహిళలకు తలనొప్పిగా మారింది.

ప్రతి ఏడాది ఆడిట్ జరుగుతున్నా..

ప్రతి ఏడాది వెలుగులో ఆడిట్ జరుగుతుంది. కానీ ఈ విషయంలో ఆడిట్ బృందం కూడా ఎందుకు మౌనంగా ఉందో తెలియని పరిస్థితి ఉంది. అయితే ప్రస్తుతం ఈ గ్రామైఖ్య సంఘం విషయంలో గట్టి యుద్ధమే జరుగుతోంది. గొట్టిపాడుకు చెందిన డ్వాక్రా మహిళలు ఈ సంఘానికి సంబంధించి ఓబీలను మార్చే విషయంలో జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ క్రమంలో జడ్పీ సీఈవో నిర్వహించిన విచారణలో రిజిస్ట్రేషన్ లేకుండా గ్రామైఖ్య సంఘం ఏమిటి అనే ప్రశ్న కూడా తలెత్తింది. ఈ విషయంలో జిల్లా అధికారులు కాని మండల వెలుగు అధికారులు కాని ఇప్పటికీ మౌనంగానే ఉంటున్నారు. తప్పులు చేసిన వీవోఏలపై కేసులు పెట్టిన ప్రత్తిపాడు వెలుగు అధికారులు ఈ గ్రామైఖ్య సంఘంలో ఇంత జరిగినా ఇంత వరకు ఎందుకు దీని గురించి పట్టించు కోలేదన్నది మహిళల నుంచి తలెత్తుతున్న ప్రశ్న.

వెలుగు సీసీ సుబ్బారావు వివరణ


గొట్టిపాడులోని రాధాకృష్ణ గ్రామైఖ్య సంఘానికి ఇంత వరకు రిజిస్ట్రేషన్ లేదని గొట్టిపాపాడు వెలుగు సీసీ సుబ్బారావు తెలిపారు. గతంలోనూ ఈ సంస్థ రిజిస్టర్ కాకపోయినా ఆన్‌లైన్‌లో ఎక్కించారని చెప్పారు.

డ్రోన్ టెక్నాలజీపై అవగాహన


డ్రోన్ టెక్నాలజీపై అవగాహన కల్పిస్తున్న నిపుణులు

తాడికొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి రంగంలో డ్రోన్ వినియోగం తప్పనిసరి అవుతుందని ప్రిన్సిపాల్ ఎం చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాలలోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ డిపార్ట్ మెంట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన ఈపీఐటీ రీసెర్చి ల్యాబ్స్ కంపెనీ సహకారంతో డ్రోన్ టెక్నాలజీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలో వరదలు వచ్చినప్పుడు డ్రోన్ సహాయంతో వరద బాధితులకు మందులు, ఆహారపదార్థాలు అందించిందని గుర్తుచేశారు. వ్యవసాయం, నిర్మాణ రంగం, భద్రత, విపత్తుల నిర్వహణ, వినోదంలో డ్రోన్ల వినియోగం ఎంతో ఉందన్నారు. ఈఈఈ విభాగాధిపతి పీవీ నరేంద్రకుమార్ మాట్లాడుతూ డ్రోన్లను పరిశోధన, అభివృద్ధి రంగంలో, రక్షణ రంగంలో ఉపయోగిస్తున్నారన్నారు. డ్రోన్లు టెక్నాలజీ నేర్చుకుంటే యువ ఇంజనీర్లకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. డ్రోన్ 7కిలోల బరువు మోయగలదని, త్వరగా గమ్యస్థానాలకు చేర్చవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరి వై.సుజిత్‌కుమార్, డ్రోన్ టెక్నాలజీ టెక్నిషియన్స్ కే.ప్రశాంత్, వీ.చరణ్, డీ.విలియమ్, కే.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు తోపుడు బండ్ల పంపిణీ


చిరు వ్యాపారులకు తోపుడు బండ్లను అందజేస్తున్న టీడీపీ నేతలు

తుళ్లూరు(బోరుపాలెం), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని బోరుపాలెం గ్రామంలో చిరువ్యాపారులకు తోపుడు బండ్లను హెల్పింగ్ హ్యాండ్స్ పేరుతో టీడీపీ నేతలు నారా లోకేశ్ స్ఫూర్తితో శుక్రవారం అందజేశారు. ఒక టిఫిన్ బండి, మూడు తోపుడు బండ్లు పంపిణీ చేశారు. వీటితో పాటు గొరిజాల సాంబశివరావు అనే దివ్యాంగుడికి ట్రైసైకిల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు కట్టా నరసింహారావు, చనుమోలు శ్రీనివాసరావు(వాసు) నెలకుదిటి నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.